RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 194 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 23-10-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది(దత్తపది)

-----------------

(గో)పకులమునందు గోవిందుడు నెపుడు
(దా)చుకున్నవాని దోచుకొనెను
(వ)నితలెల్లకలిసి పట్టుకొనగ నతడు
(రి)వ్వుమనుచు నురికె గువ్వవోలె

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




## జైషేలో మహిళా ఉగ్రవాద దళం

- ఉగ్రవాదంపై జైషే ఆన్‌లైన్ కోర్సులకు ప్లాన్
- మహిళలను ఉగ్రకుట్రలోకి లాగే యత్నం
- పలు జాతీయ మీడియాల్లో కథనాలు

**ఇస్లామాబాద్,అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

మహిళలను మతపరమైన ఉగ్రవాదంలోకి లాక్కొచ్చేందుకు జిహాదీ గ్రూపులు కొత్త స్కెచ్ వేస్తున్నాయి. దీంతో తమ ఉగ్రముఠాను విస్తరించాలన్న కుట్రలతో పనిచేస్తున్నట్లు సమాచారం. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకునేందుకు తొలిసారి ప్రత్యేకంగా జైషే మహిళా బ్రిగేడ్‌ను ఏర్పాటుచేసినట్లు

-మిగతా 2 లో



## భారత్‌పై సుంకాలు తగ్గించే యోచన

- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై అమెరికా ఆసక్తి
- 50శాతం నుండి 15 నుండి 16శాతానికి తగ్గనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడి

**వాషింగ్టన్, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

సుంకాలను తగ్గించేందుకు భారత్ అమెరికాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరనుంది. దీర్ఘకాలంగా నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందానికి భారత్-అమెరికాలు చాలా దగ్గరగా ఉన్నాయని, దీంతో భారత దిగుమతులపై అమెరికా సుంకాలు 50శాతం నుండి 15 నుండి 16శాతానికి తగ్గనున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇంధనం, వ్యవసాయంపై ఆధారపడిన ఈ ఒప్పందంతో, క్రమంగా భారత్ రష్యా నుండి ముడి చమురు దిగుమతులు తగ్గించుకునే అవకాశం ఉందని తెలిపాయి. సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ ఈ అంశంపై బుధవారం జాతీయ మీడియాలో ఒక కథనం ప్రచురితమైంది. అమెరికాతో చర్చల్లో భాగంగా, జన్యుపరంగా మార్పులు చేయని మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులను పెంచడానికి భారత్ అనుమతించే అవకాశం ఉందని ఆ కథనం పేర్కొంది. ఈ ఒప్పందంలో సుంకాలు మరియు మార్కెట్ యాక్సెస్‌ను క్రమానుగతంగా సమీక్షించే యంత్రాంగం కూడా ఉండవచ్చని తెలిపింది. ఈ నెలలో జరగనున్న ఏసియన్ శిఖరాగ్ర సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని

-మిగతా 2 లో




# రెండేళ్లు టార్గెట్

## రెండేళ్లలో ఉస్మానియా ఆస్పత్రి పూర్తి

- ఆధునిక పద్దతుల్లో అవసరాల మేరకు నిర్మాణాలు
- ఆస్పత్రికి అసవరమైన వైద్య పరికరాలు సిద్ధం చేయాలి
- ప్రజలకు ఇబ్బంది లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు

**హైదరాబాద్, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

గోషామహల్ వద్ద చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్షించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సీఎం సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది

-మిగతా 2 లో



## రవాణాశాఖలో ఏఐ సాంకేతికత అమలు

- షోరూముల్లోనే వాహన రిజిస్ట్రేషన్ల పరిశీలన
- ఢిల్లీ కాలుష్యం దృష్ట్యా హైదరాబాద్ పై ప్రత్యేక దృష్టి
- అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

దిల్లీలో కాలుష్యం ఎలా ఉందో అందరం చూస్తూనే ఉన్నామని.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ప్రణాళికలు చేపట్టినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రవాణాశాఖ కార్యాలయాల్లో మధ్యవర్తులు లేకుండా చేస్తాం. ఈ శాఖలో ఏఐ వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రూ.577 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చాం. దీంతో ఆ వాహనాల విక్రయాలు 0.03 శాతం నుంచి 1.30 శాతానికి పెరిగాయి. వాహన సారథి పోర్టల్‌ను పూర్తిగా

-మిగతా 2 లో




## ఆల్‌టైమ్ రికార్డు సృష్టించిన యూపీఐ పేమెంట్స్..

- దీపావళి కొనుగోళ్ల జోరుతో యూపీఐ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త మైలురాళ్ల
- పండగకు ముందు రోజు యూపీఐలో ఒక్కరోజే 74 కోట్ల లావాదేవీలు
- సెప్టెంబర్ నెలతో పోలిస్తే ఇది 13 శాతం అధికం.

**న్యూఢిల్లీ అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

దీపావళి పండుగ సీజన్ కావడంతో డిజిటల్ చెల్లింపులు సరికొత్త శిఖరాలకు చేరుకున్నాయి. ముఖ్యంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలు మునుపెన్నడూ లేనంతగా పెరిగి ఆల్-టైమ్ రికార్డు లను సృష్టిస్తున్నాయి. దీపావళి కొనుగోళ్ల జోరుతో యూపీఐ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త మైలురాళ్లను అధిగమించింది.నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. అక్టోబర్ నెలలో యూపీఐ ద్వారా జరుగుతున్న సగటు రోజువారీ లావాదేవీల విలువ ఏకంగా రూ. 94 వేల కోట్లకు చేరింది. సెప్టెంబర్ నెలతో పోలిస్తే ఇది 13 శాతం అధికం. గత కొన్నేళ్లుగా జరుగుతున్న నెలవారీ యూపీఐ పేమెంట్లతో పోల్చి చూస్తే ఇది అత్యధిక వృద్ధి అని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల ఇంకా వారం రోజులు మిగిలి ఉండగానే యూపీఐ తన జీవితకాలంలోనే అత్యుత్తమ నెలవారీ ప్రదర్శనను నమోదుచేసే దిశగా దూసుకెళ్తోంది. దీపావళి పండగతోపాటు ఇటీవల జీఎస్టీ రేట్లలో వచ్చిన మార్పులు ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి. ఈ నెల 20న దీపావళి సందర్భంగా చెల్లింపులు భారీగా పెరిగాయి. పండగకు ముందు


-మిగతా 2 లో

## ఇరుముడితో శబరిమలకు ద్రౌపది ముర్ము..

- అయ్యప్పని దర్శించుకున్న తొలి రాష్ట్రపతి

**న్యూఢిల్లీ**

కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమల అయ్యప్ప స్వామి వారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు.బుధవారం ఉదయం పంబ నుంచి ఇరుముడితో ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతికి.. అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాల ధరించి ఇరుముడితో 18 మెట్లు ఎక్కి అయ్యప్పను దర్శించుకున్నారు. అక్కడ ఇరుముడి సమర్పించి.. ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ముర్ము ఓ రికార్డు నెలకొల్పారు. శబరిమల ఆలయాన్ని సందర్శించిన తొలి ప్రెసిడెంట్‌గా నిలిచారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా



-మిగతా 2 లో

## బకాయిలు అడిగితే బ్లాక్‌మెయిల్ చేసినట్టా..?

- దౌర్భగ్యస్థితి కాంగ్రెస్ సర్కారు
- కేంద్రమంత్రి బండిసంజయ్ ఫైర్

**హైదరాబాద్, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

పెండింగ్ బకాయిలు అడిగితే బ్లాక్ మెయిల్ లాగా సీఎం రేవంత్‌రెడ్డి ఫీల్ అవుతున్నారని, కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇతరత్రా పెండింగ్ బిల్లులు చెల్లించలేని స్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉన్నదని కేంద్రమంత్రి బండిసంజయ్ ఫైర్ అయ్యారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలరాస్తున్నారంటూ ఫైర్ అయ్యారు.



-మిగతా 2 లో

## పారిశ్రామిక బంధం బలోపేతమయ్యేలా సహకరించండి

- దుబాయ్ లో భారత ఎంబసీ ప్రతినిధులతో సింఎం
- పలు సంస్థలతో పెట్టుబడులపై చర్చ

**అమరావతి అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఇ)తో పారిశ్రామిక బంధం బలపడేలా సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దుబాయ్ లోని భారత రాయబార కార్యాలయ ప్రతినిధులను కోరారు. మూడురోజులపాటు దుబారు పర్యటనకు వెళ్లిన ఆయన తొలిరోజు ఇండియన్ కాన్సుల్ జనరల్ సతీష్‌కుమార్ శివన్, అబుదాబీలోని ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌తో సమావేశమైనారు. రాష్ట్రంలో పెట్టుబడులకు




-మిగతా 2 లో

## రేవంత్ రెడ్డి ప్రకటనలు ఘనం.. ఆచరణ శూన్యం :



- చిరు ఉద్యోగుల శ్రమను, కష్టాన్ని గౌరవించడం మీకు చేతకాదా?
- గొప్పలు చెప్పి, ఆచరణలో మాత్రం గాలికి వదిలేశారు
- ఉపాధ్యాయుల ఆవేదన వింటే మనస్సు చలించిపోతుంది
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**హైదరాబాద్, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

రేవంత్ రెడ్డి ప్రకటనలు ఘనం.. ఆచరణ శూన్యమని.. గాలిమాటలతో ప్రజలను ఇంకెంత కాలం మోసం చేస్తాంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశధ్య నిర్వహణ కోసం నియమించిన స్కావెంజర్లకు తొమ్మిది

-మిగతా 2 లో

# నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

## బీసీ రిజర్వేషన్లు..స్థానిక ఎన్నికలపై చర్చ

- మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో సమావేశం
- కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం
- ఇద్దరు పిల్లల నిబంధన ఆర్డినెన్సుకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది.

**హైదరాబాద్, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

తెలంగాణ మంత్రి వర్గం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాయలంలో సమావేశం కానుంది. మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై కేబినెట్ చర్చించనుంది. దీంతో ఇటీవల భేటీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధన ఆర్డినెన్సుకు మంత్రివర్గం ఆమోదం

-మిగతా 2 లో



# జైషేలో మహిళా ఉగ్రవాద దళం

(మొదటి తరువాయి)

ఇటీవల నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటైన జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ మహిళలకు ఉగ్రవాదంపై ఆన్‌లైన్ కోర్సులు నిర్వహించనున్నట్లు నిఘా వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు తెలిపాయి. ఈ కోర్సుకు 'తౌఫత్ అల్ ముమినాత్'గా పేరు పెట్టినట్లు తెలుస్తోంది. జైషే చీఫ్ మసూద్ అజార్ చెలలెళ్లు సాదియా అజార్, సమైరా అజార్ దీనికి నాయకత్వం వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రంపై భారత్ బాంబులు జారవిడిచిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10 మంది మృతి చెందారు. మృతుల్లో మసూద్ బావ, సాదియా భర్త యూసఫ్ అజార్ కూడా ఉన్నాడు. కాగా మసూద్ మరో సోదరి సమైరా భర్త.. పుల్వామా ఉగ్రదాడి కుట్రదారు ఉమర్ ఫరూక్ గతంలో భారత భద్రతా దళాల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ప్రస్తుతం వీరిరువురూ మహిళా బ్రిగేడ్ సభ్యులకు ఆన్‌లైన్ కోర్సుల్లో మతపరమైన, జిహాద్‌కు సంబంధించిన పాఠాలను బోధించనున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇతర మహిళలను కూడా ఉగ్రవాదం వైపు ఆకర్షించడానికి ఈ బ్రిగేడ్ సభ్యులు పని చేస్తున్నట్లు తెలిపాయి. ఈ మహిళ బ్రిగేడ్‌లో జైషే కమాండర్ల భార్యలతో పాటు బహవల్‌పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్ వంటి ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన మహిళలను సభ్యులుగా నియమించుకున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 8 నుంచి సెషన్లు ప్రారంభం కానున్నాయని.. ఇందులోభాగంగా ప్రతిరోజు 40నిమిషాల పాటు మసూద్ చె÷–లలెళ్లు, కమాండర్ల కుటుంబసభ్యులు మహిళలకు పాఠాలు బోధిస్తారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకోసం మహిళా బ్రిగేడ్‌లోని సభ్యుల నుంచి కొంత మొత్తంలో విరాళాలు కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త మహిళా బ్రిగేడ్ భారత్‌లో తన నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసే అవకాశం ఉందని ఇటీవల నిఘా వర్గాలు హెచ్చరించాయి. సోషల్ మీడియా, ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లతో జమ్మూకశ్మీర్, యూపీ వంటి ప్రాంతాల్లో మహిళలను ఈ బ్రిగేడ్‌లో చేరేలా ఆకర్షించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో భారత అధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం.

## భారత్‌పై సుంకాలు తగ్గించే యోచన

(మొదటి తరువాయి)

ఖరారు చేసే అవకాశం ఉందని నివేదించింది. భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వైట్‌హౌస్ స్పందించాల్సి వుంది. మంగళవారం భారత ప్రధాని మోడీతో మాట్లాడానని, ఎక్కువగా వాణిజ్యంపై దృష్టిసారించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇంధనంపై కూడా చర్చలు జరిపామని ఆయన అన్నారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్లను పరిమితం చేస్తుందని మోడీ తనకు హామీ ఇచ్చారని చెప్పుకొచ్చారు. అయితే ట్రంప్, తాను చర్చలు జరిపామని మోడీ కూడా స్పష్టం చేశారు. చర్చలకు సంబంధించిన వివరాలు వెల్లడించలేదు.

## ఆల్‌టైమ్ రికార్డు సృష్టించిన యూపీఐ పేమెంట్స్..

(మొదటి తరువాయి)

రోజు యూపీఐలో ఒక్కరోజే 74 కోట్ల లావాదేవీలు జరిగి ఆల్–టైమ్ రికార్డు సృష్టించాయి. ఈ నెలలో ఇప్పటివరకు సగటున రోజుకు 69.5 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. సెప్టెంబర్‌లోని 65.4 కోట్ల రికార్డును ఇప్పటికే అక్టోబర్ సగటు అధిగమించింది. సాధారణంగా నెల ఆరంభంలో జీతాలు, ఈఎంఐ చెల్లింపుల కారణంగా లావాదేవీలు ఎక్కువగా ఉండి, నెల మధ్యకు వచ్చేసరికి తగ్గుముఖం పడతాయి. కానీ ఈసారి పండగ ప్రభావంతో ఆ ధోరణి మారింది. ఈ నెల 20 నాటికే రోజువారీ లావాదేవీల విలువ ఆరుసార్లు లక్ష కోట్ల రూపాయల మార్కును దాటింది. సెప్టెంబర్‌లో ఈ ఘనత కేవలం మూడుసార్లే నమోదైంది. ఈ దూకుడు చూస్తుంటే ఈ నెలలో మొత్తం లావాదేవీల విలువ తొలిసారిగా రూ. 28 లక్షల కోట్లు దాటుతుందని, గత రికార్డయిన రూ.25 లక్షల కోట్ల మార్కును అధిగమిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశంలోని మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో దాదాపు 85 శాతం వాటా యూపీఐదే కావడం విశేషం అంటున్నారు.

## బకాయిలు అడిగితే బ్లాక్‌మెయిల్ చేసినట్టా..?



(మొదటి తరువాయి)

బకాయిలు చెల్లించాల్సిందే అంటూ పట్టుబడిన బండి సంజయ్.. ప్రభుత్వానికి పలు అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్ మెయిల్ చేస్తారా? విద్యార్థులు, యాజమాన్యాల భవిష్యత్తుతో చెలగాటమాడతారా? బ్లాక్ మెయిల్ చేస్తే చూస్తూ ఊరుకుంటామా? కమీషన్లు రావనే సాకుతో బకాయిలు చెల్లించడం లేదా? అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని కూడా కాలరాస్తారా? పదేపదే ఇచ్చిన మాటను తప్పే వాళ్లను ఏమనాలి? బీహార్ ఎన్నికలకు పైసలు ఇక్కడి నుండే పంపుతున్నారు కదా? విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు చెల్లించలేరా? ఈసారి తక్షణమే బకాయిలు మొత్తం చెల్లించాల్సిందే.. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు' అంటూ హెచ్చరించారు. విద్యార్థులు, యాజమాన్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయమని వార్నింగ్ ఇచ్చారు. యాజమాన్యాలూ..... ప్రభుత్వానికి భయపడి సమ్మె విరమిస్తే అంతే సంగతులు.. భవిష్యత్తులో ఎవరూ అండగా నిలబడే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలపైనా రోడ్డెక్కడం తథ్యమని వెల్లడించారు. మంత్రులు ప్రతి పనికి కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ సొమ్మును కాంగ్రెస్ హైకమాండ్‌కు కప్పం కడుతున్నారంటూ బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాగా.. ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని నల్లకుంట శంకర్‌మఠ్‌కు చేరుకున్న బండి సంజయ్.. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రుంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతి స్వామి ఆశీస్సులను కేంద్రమంత్రి అందుకున్నారు.

# రెండేళ్లు టార్గెట్

(మొదటి తరువాయి)

లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పది రోజులకోసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పనుల వేగవంతానికి సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రానున్న వందేళ్ల అవసరాలకు తగిన సదుపాయాలతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి ఉండాలని.. ఆధునిక వైద్య పరికరాలతో అత్యాధునిక సదుపాయాలు కల్పించాలని వెల్లడించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్మాణ సమీక్ష చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేశారు. స్థానికులకు ఇబ్బంది లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ ఆసుపత్రుల పనుల పర్యవేక్షణకు అధికారుల నియామకం జరిగిందన్నారు. వచ్చే జూన్ నాటికి అన్ని మెడికల్ కళాశాలలు, ఆసుపత్రుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్, భద్రతా ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని పోలీసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సమావేశానికి సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాసరాజు, శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఎంఏ అండ్ యూడీ సెక్రటరీ ఇలంబర్తి, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# రవాణాశాఖలో ఏఐ సాంకేతికత అమలు

(మొదటి తరువాయి)


అందుబాటులోకి తెచ్చాం. రాష్ట్రంలో వాహనాల సంఖ్య 1.70 కోట్లకు చేరింది. షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్ చేసే అంశంపై ఆలోచన చేస్తున్నాం. ప్రజలు సహకరిస్తేనే.. ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుందని మంత్రి పొన్నం అన్నారు. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ట్రాన్స్‌పోర్ట్ చెక్‌పోస్టులను తక్షణమే మూసివేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్టీఏ చెక్ పోస్టుల రద్దు చాలా పెద్ద నిర్ణయమని పేర్కొన్నారు. చెక్ పోస్టుల విషయంలో మరింత పారదర్శకత తీసుకొస్తామని.. ఇందులో భాగంగానే ప్రస్తుతమున్న ఆర్టీఏ చెక్ పోస్టులను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రతి ఆర్టీఏ కార్యాలయంలో సిమ్యులేటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రవాణా వ్యవస్థలో ఏఐ సేవలు మరింత వినియోగిస్తామని స్పష్టం చేశారు. బుధవారం రవాణా శాఖపై



సంబంధిత అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం ఏ విధంగా ఉందో అందరం చూస్తున్నామని.. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దని అన్నారు. ప్రజలు సహకరిస్తేనే ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుందన్నారు. రోడ్డు భద్రతపై విద్యార్థులు, ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని.. రూల్స్ అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించాలనే లక్ష్యంలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు రాయితీలు ఇస్తున్నామని.. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వాహనాల స్క్రాపింగ్ విషయంలో కొత్త పాలసీ తీసుకొస్తున్నామని చెప్పారు. వాహనాల స్క్రాపింగ్‌ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు యోచిస్తున్నామన్నారు.

## ఇరుముడితో శబరిమలకు ద్రౌపది ముర్ము..

(మొదటి తరువాయి)



రాష్ట్రపతి ముర్ము ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలో రెండు గంటల పాటూ బస చేయనున్నారు. అక్కడే రాష్ట్రపతికి ప్రత్యేకంగా ఆహారం వండి వడ్డించనున్నారు. మధ్యాహ్నం 3:10 గంటలకు ముర్ము శబరిమల నుంచి బయల్దేరి వెళ్తారు. రాష్ట్రపతి పర్యటన నిమిత్తం ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

## పారిశ్రామిక బంధం బలోపే తమయ్యేలా సహకరించండి

(మొదటి తరువాయి)




ఉన్న అవకాశాలను వారితో చర్చించారు. గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, పెట్రో కెమికల్స్, పోర్టులు, లాజిస్టిక్స్, ఏవియేషన్, ఇండస్ట్రియల్ పార్కులు, రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు, అతిథ్యరంగం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా రాష్ట్రంలో వనరులు, అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వారికి వివరించారు. గూగుల్ సంస్థ విశాఖలో 15 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. 1054 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ సముద్రతీర ప్రాంతంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, హార్బర్లను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. లాజిస్టిక్స్ రంగం కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. యుఏఇ సావరిన్ ఫండ్స్ ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపై వారితో చర్చించారు.. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో సిఐఐతో కలిసి భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకుముందు హైదరాబాద్ నుండి దుబాయ్ చేరుకున్న సిఎంకు అక్కడ ఘనస్వాగతం లభించింది.

**అమరావతికి రూ.100 కోట్ల విరాళం**

దుబాయ్ లోని ప్రముఖ రియాల్టీ సంస్థ శోభా గ్రూపు అమరావతిలో ప్రపంచస్థాయి గ్రంథాలయ నిర్మాణానికి రూ.100 కోట్ల విరాళం ప్రకటించింది. దీనికి స్పందించిన చంద్రబాబునాయుడు అమరావతి నిర్మాణంలో శోభా గ్రూపు భాగస్వామి కావాలని కోరారు. ఎపికి వచ్చి రాజధాని నిర్మాణాన్ని పరిశీలించాలని కోరారు. మూడేళ్లలో రాజధానిలో అన్ని సదుపాయాలూ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. విశాఖలో గూగుల్ ఏఐహబ్, అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తామని అన్నారు.

# నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

(మొదటి తరువాయి)



తెలపనుంది. అలాగే, ఎస్ఎల్‌బిసి పునరుద్ధరణ పనులు, ఎస్ఆర్ఎస్‌పి రెండో దశకు రాంరెడ్డి దామోదర రెడ్డి పేరు, కాళేశ్వరం పునరుద్ధరణ సహా పలు ప్రాజెక్ట్ పనుల పై మంత్రి వర్గం చర్చించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలపై గురువారం జరిగే సమావేశంలో మంత్రి వర్గం తుది నిర్ణయం తీసుకోనుంది. పాత పద్దతిలో ఎన్నికలకు వెళ్లాలా? లేదా 42 శాతం రిజర్వేషన్లతో వెళ్లాలా? అనేది దానిపై కేబినెట్ చర్చించనుంది. కాగా ఇప్పటికే ఈ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయనిపుణ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని న్యాయస్థానాల్లో కొట్లాడేందుకు రేవంత్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేందుకు.. ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతకు ఏ పథకం అమలు చేస్తారన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే రాష్ట్ర మంత్రి వర్గం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుదనేది ఆసక్తిగా మారింది.

## రేవంత్ రెడ్డి ప్రకటనలు ఘనం.. ఆచరణ శూన్యం :

(మొదటి తరువాయి)

నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం సిగ్గుమాలిన చర్య అంటూ మండిపడ్డారు. చిరు ఉద్యోగుల శ్రమను, కష్టాన్ని గౌరవించడం మీకు చేతకాదా? అంటూ నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు బెనిఫిట్స్ కోసం, స్కావెంజర్ల వంటి చిరు ఉద్యోగులు వేతనాల కోసం ఎదురుచూస్తూ నరకయాతన అనుభవిస్తున్నారంటూ మండిపడ్డారు. మరోవైపు పేద విద్యార్థుల కడుపు నింపే మధ్యాహ్న భోజన పథకం నిధులు సైతం ఏడాదిగా పెండింగ్‌లో పెట్టారని.. కేసీఆర్ ప్రారంభించిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని నిలిపివేశారని.. మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించకుండా అమలు గాలికి వదిలేశారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న సీఎం రేవంత్ సొంత శాఖలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతన సమస్యలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని గొప్పలు చెప్పి, ఆచరణలో మాత్రం గాలికి వదిలేశారని.. మీ మాటల మాయాజాలంతో ఎంతకాలం ఉద్యోగులను మోసం చేస్తారు? మండిపడ్డారు. సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు సేవలందించిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కులైన బెనిఫిట్స్ ఇవ్వకుండా వారిని మానసికంగా వేధించడం అమానవీయం, అనైతికమన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం నెలలు తరబడి ఎదురు చూస్తున్నామని చెబుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆవేదన వింటే మనస్సు చలించిపోతుందని.. మధ్యాహ్న భోజన పథకం సహా విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, స్కావెంజర్ల 9 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## 2025 అక్టోబర్ 23, గురువారం తెలుగు పంచాంగం





### నేటి పంచాంగం

మాసం - పక్షం
కార్తీక మాసం
శుక్ల పక్షం
తిథి
తృతీయా: అక్టోబర్ 22 రాత్రి 10:35
అక్టోబర్ 23 రాత్రి 9:59 వరకు
చతుర్థి: అక్టోబర్ 23 రాత్రి 9:59 అక్టోబర్ 24 రాత్రి 9:41 వరకు
నక్షత్రం
అనూరాధ: అక్టోబర్ 22 రాత్రి 10:17 అక్టోబర్ 23 రాత్రి 9:20 వరకు
జ్యేష్ఠ: అక్టోబర్ 23 రాత్రి 9:20 అక్టోబర్ 24 రాత్రి 8:41 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:45 - 5:29
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:38 - 12:22
అమృతకాలం: రాత్రి 8:10 - 9:50
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 1:30 - 3:00
యమగండం: ఉదయం 6:15 - 7:44
గుళికా: ఉదయం 9:13 - 10:42
దుర్ముహూర్తం: ఉదయం 10:05 - 10:53,
మధ్యాహ్నం 2:48 - 3:36
వర్జ్యం: మధ్యాహ్నం 12:45 - 2:20

# పార్టీకి ప్రాణం పెట్టిన కార్యకర్త ఇప్పుడు ఎవరి అండ?

**మాడ్గుల, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామానికి చెందిన దండు శేఖర్ గౌడ్, ఒక సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించి, రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేసిన విశ్వాసపాత్రుడైన కార్యకర్త. కొద్దిపాటి చదువుతోనే ప్రజల కోసం, సమాజం కోసం, పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తూ, నిబద్ధతకు మారుపేరుగా నిలిచాడు. తొలుత తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన శేఖర్, జైపాల్ యాదవ్‌ను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించడంలో కీలక పాత్ర పోషించాడు. టిడిపి-బిజెపి అభ్యర్థిగా తల్లోజు ఆచారి కోసం కూడా పనిచేశాడు. 2006లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, వారి పథకాలకు ఆకర్షితుడై, భట్టు కిషన్ రెడ్డి ప్రోత్సాహంతో కాంగ్రెస్ పార్టీలో చేరాడు. అప్పటి నుంచి దాదాపు 20 సంవత్సరాలుగా ఆ పార్టీకి అంకితభావంతో సేవలందిస్తున్నాడు. ఆర్కపల్లి గ్రామంలో రెండు పర్యాయాలు వార్డు సభ్యునిగా




పనిచేసి, స్థానిక సర్పంచ్‌లు, మండల ఎంపీపీల గెలుపు కోసం కృషి చేశాడు. సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయినా, ప్రజల కోసం పనిచేయడం ఆపలేదు. పార్టీ అభ్యర్థిగా నిలవడానికి రెండు ఎకరాల భూమిని అమ్మడం ఆయన త్యాగానికి నిదర్శనం. మండల కిసాన్ మోర్చాగా పనిచేసిన శేఖర్, ఇటీవల క్యాన్సర్ బారిన పడి వైద్యం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నాడు. ఈ విషాద సమయంలో భార్య శ్యామలమ్మకు బ్రెయిన్ స్ట్రోక్ రావడం, బ్రెయిన్ సర్జరీ, గర్భసంచి చికిత్స వంటి సమస్యలు కుటుంబాన్ని మరింత కుదిపేశాయి. ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఈ కుటుంబం, ఆసుపత్రి ఖర్చులు, అప్పులతో ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. ఆరోగ్య పరిస్థితి బాగలేకపోయినా, ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపీ మల్లురవి గెలుపు కోసం తనదైన శైలిలో కృషి చేశాడు. పార్టీకి అంకితభావంతో పనిచేసిన శేఖర్‌కు ఇప్పుడు పార్టీ అండగా నిలవాల్సిన సమయం ఇది. పదవులు పొందిన నాయకులు, ఆయన త్యాగాలను గుర్తించి, కేవలం సానుభూతి వ్యక్తం చేయకుండా, శక్తిమేరకు సహాయం అందించాలి. దండు శేఖర్ గౌడ్ లాంటి కార్యకర్తల త్యాగాలపై పార్టీ నిలబడితే, అది కేవలం ఒక వ్యక్తికి సహాయం కాదు అది పార్టీ విలువలకు న్యాయం చేయడమే అవుతుంది.

# విద్యాలయం దేవాలయం తో సమానం

**-విద్యార్థుల భవిష్యత్తు కోసం వారి భవితవ్యం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది.**
**-ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వెల్లడి.**

**అబ్దుల్లాపూర్ మెట్టు.**
**అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ లోని మండల కేంద్రంలో ఉన్న సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం లో పాల్గొన్న ఏమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి .డిగ్రీ పూర్తి చేసుకున్న వందలాది మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందించిన మల్ రెడ్డి రంగారెడ్డి అంతకు ముందు కళాశాల విద్యార్థులు అధ్యాపకులు ఏమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి ఘన స్వాగతం పలికారు..అనంతరం కళాశాల ఆవరణలో మొక్కను నాటడం జరిగింది.లివిద్యార్థుల తాగునీటి సమస్య దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు అధ్యాపకులకు కృష్ణ వాటర్ మంచినీరు సరఫరా అందించే నల్లాను ఏమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ 1998 సంవత్సరంలో



అప్పటి ప్రభుత్వంలో ఏమ్మెల్యే గా ఉండి 10 ఎకరాల స్థలంలో సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశానని గుర్తు చేశారు..ఇట్టి కళాశాల లో ఎటువంటి సమస్యలు లేకుండా చూస్తానని విద్యార్థుల భవిష్యత్తు కోసం పలు కంపెనీల తో మాట్లాడి CSR నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు..డిప్లమా విద్యార్థులకు మంచి అవకాశం ఉందన్నారు..లి ప్రజా ప్రభుత్వం విద్య కి అధిక ప్రాధాన్యం ఇస్తుందని కేవలం 2 సంవత్సరాల లోపే దాదాపు 150,000/- ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కిందని అన్నారు..భారత భవిష్యత్తు నగరంలో అనేక కంపెనీలు రాబోతున్నాయని మన ప్రాంతం అనేక రంగాల్లో అభివృద్ధి చెందుతోందని అన్నారు.. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగముని నాయక్ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి సింగల్ విండో చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ చారి తో పాటు నాయకులు బుర్ర మహేందర్ గౌడ్ మండల్ జడ్పిటిసి బింగి దేవదాస్ గౌడ్ చంద్రం గౌడ్ రమేష్ గౌడ్.ఉషయ్య తో పాటు పలువురు మాజీ ప్రజా ప్రతినిధులునాయకులు అధ్యాపకులు. విద్యార్థులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో యువ నాయకత్వానికి నూతన ఊపిరి



**జూబ్లీహిల్స్, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉపఎన్నికల నేపథ్యంలో, యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తూ, తెలంగాణ రాష్ట్ర విద్యార్థి కాంగ్రెస్ (ఎన్ఎస్‌యూఐ) రాష్ట్ర కార్యదర్శి యండి ఫరీద్‌ను యూసుఫ్‌గూడ డివిజన్ ఇన్‌చార్జిగా నియమించారు. ఈ బాధ్యతను తెలంగాణ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అఫ్రోజ్ ముల్లా, రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ స్వామి, ఉపాధ్యక్షుడు రితీష్ రావు సంయుక్తంగా ప్రకటించారు.జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా, నాపై నమ్మకంతో ప్రచార కమిటీ సభ్యునిగా ఎంపిక చేయడం జరిగింది. ఇది పార్టీపై ఉన్న నిబద్ధతకు, గతంలో చేసిన కృషికి గుర్తింపు లభించిన సందర్భం.ప్రజల మద్దతుతో, పార్టీ నాయకత్వం మార్గనిర్దేశంతో, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయాన్ని సాధించేందుకు సమిష్టిగా కృషి చేయనున్నాం. యువతలో నూతన ఉత్సాహాన్ని నింపేలా, ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ విధానాలను చేరువ చేయడమే ప్రధాన లక్ష్యం.

# టీఎస్పీఎస్సీ గ్రూప్-1లో ఎంపికైన సుదీప్‌రెడ్డికి అభినందనలు

**ప్రజాసేవలో మరో తరం - సబిరెడ్డి కుటుంబం గర్వకారణం**
**అధ్యక్షులు నారాయణరెడ్డి**



**వనపర్తి,అక్టోబర్ 22( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
టీఎస్పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో సబిరెడ్డి సుదీప్‌రెడ్డి డీఎస్పీ హోదాకు ఎంపిక కావడంతో, రెడ్డి సేవా సమితి, వనపర్తి జిల్లా తరఫున ఘనంగా సన్మానం చేయబడింది. ఈ సందర్భంగా రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షులు తలకంటి నారాయణరెడ్డి మాట్లాడుతూ సబిరెడ్డి వెంకటరెడ్డి సుదీర్ఘకాలం ప్రజలకు అండగా నిలిచి సేవ చేసిన నాయకుడు. ఆయన బాటలోనే తన కుమారుడు సుదీప్ ఇప్పుడు విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు సేవ చేసే అవకాశం పొందడం గర్వకారణం అని నారాయణరెడ్డి అన్నారు. ప్రజాసేవలో మరో తరం అడుగుపెడుతున్న ఈ సందర్భం ఆనందదాయకం,అని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో అధ్యక్షుల తో పాటుగా జిల్లా పలు రెడ్డి సోదరులుసుదీప్‌రెడ్డిని సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మందడి మేఘారెడ్డి, కర్నాల మధుసూదన్‌రెడ్డి, గౌని నాగేశ్వరరెడ్డి, మందడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తొగుట పీహెచ్‌సీని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్

**"తెలంగాణ రైజింగ్ - 2047" సిటిజన్ సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి**

**సిద్దిపేట, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తొగుట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, అటెండెన్స్, ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్‌తో పాటు సిబ్బంది అందరూ సమయానికి హాజరవ్వాలని, సరిపడిన మందులు, ల్యాబ్ పరికరాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయుష్ కేంద్రంలో యునాని వైద్యం



సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మధ్య వయస్సు, వృద్ధులకు యునాని వైద్యం ప్రయోజనకరమని పేర్కొన్నారు. స్వయంగా తన కాలి మడమ నొప్పి గురించి యునాని వైద్యురాలిని సంప్రదించి, హబ్బే జోగ్రజ్ గోగుల్ మాత్రల వినియోగంపై సూచనలు పొందారు. అదే సమయంలో, "తెలంగాణ రైజింగ్ - 2047" సిటిజన్ సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్ రూపకల్పన కోసం చేపట్టిన ఈ సర్వే ఈనెల 25వ తేదీతో ముగియనున్నదని, వెబ్‌సైట్ ద్వారా తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# హుస్నాబాద్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**-రైతులకు అన్ని రంగాల్లో మద్దతు:**
**- పత్తి, మొక్కజొన్న, వడ్లు, ఆయిల్ ఫ్యాక్టరీ, గౌరవెల్లి ప్రాజెక్ట్**

**సిద్దిపేట, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ నియోజకవర్గం కొండాపూర్ సమీపంలోని గోమాత జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. తెలంగాణలో టపాస్ కిసాన్ యాప్ ద్వారా సూచించిన తొలి కేంద్రంగా ఇది గుర్తింపు పొందింది. పత్తి తేమ శాతాన్ని పరిశీలించిన మంత్రి, రైతులకు కనీస మద్దతు ధర రూ.8100 అందుబాటులో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. వరి, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా



చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్లకు ఆదేశించినట్లు తెలిపారు. సన్న వడ్లకు రూ.500 బోనస్, 48 గంటల్లో చెల్లింపులు, అక్కన్నపేటలో సన్‌ఫ్లవర్ విత్తనాల పంపిణీ, నర్మేటలో ఆయిల్ ఫ్యాక్టరీ ట్రయల్ రన్, హార్టికల్చర్, సెరికల్చర్‌పై అవగాహన కార్యక్రమాలు రైతుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలుగా పేర్కొన్నారు. త్వరలో గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి పంట పొలాలకు నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఇతర నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రశ్నించటం, పోరాడటం నేర్పిందే సిపిఐ: బాల నరసింహ



**వనపర్తి,అక్టోబర్ 22(నీలగిరి ఎక్స ప్రెస్):** వందేళ్లలోదేశ పేదలకు, బాధితులకు ప్రశ్నించటం, పోరాడటం నేర్పిందే సిపిఐ అని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాల నరసింహ అన్నారు. బుధవారం వనపర్తి శ్వేతా నగర్ కామ్రేడ్కటికనేని గోపాల్ రావు భవన్లో సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కె శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా కామ్రేడ్ బాల నరసింహ పాల్గొని మాట్లాడుతూ.. వందేళ్లలో సిపిఐ ఏమిచ్చిందని కొందరు విమర్శ చేస్తుంటారని, పేదలకు బాధితులకు ప్రశ్నించటం పోరాటం న్యాయం పొందటం నేర్పింది సిపిఐ మాత్రమే అన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా కష్టజీవులకు అండగా సిపిఐ పోరాడి వారి కనుకూలంగా చట్టాలను తెచ్చిందన్నారు.ఖమ్మంలో డిసెంబర్ 26న సిపిఐ వందేళ్ళ విజయోత్సవ సభ జరగనుంది అన్నారు. దేశ స్వాతంత్ర కోసం, తెలంగాణ విముక్తి కోసం,తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం సిపిఐ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. ప్రజా పోరాటాలతో పేదలకు భూములు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రుణమాఫీ ,ఉపాధి హామీ పథకం, వంటి వాటి ని ఎన్నో సాధించిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కార్మికులకు కనీస వేతనం వంటి చట్టాలు సాధించిందన్నారు. వందేళ్ళ విజయోత్సవ నేపథ్యంలో సాధించిన విజయాలను గ్రామ గ్రామాన ప్రజలకు వివరించేందుకు గద్వాల జోడేఘాట్ బాసర నుంచి ప్రచార జాతాలు బయలుదేరి డిసెంబర్ 26న జరగనున్న విజయోత్సవ సభకు చేరుకుంటాయన్నారు.గద్వాల నుంచి బయలుదేరిన వనపర్తి జిల్లా లో 6 మండలాలు, నారాయణపేట3, మహబూబ్నగర్ 4, గద్వాల్ 2, నాగర్ కర్నూల్ 6 మండలాలలో పర్యటించి ప్రచారం చేస్తుందన్నారు. రాష్ట్రంలో సిపిఐ విస్తరణకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ప్రజా పోరాటాల్లో సిపిఐ ప్రత్యేక పాత్రను ప్రజలు గుర్తించారన్నారు. పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి పార్టీని బలోపేతం చేయాలన్నారు. పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలకు వివరించి ఆకర్షించాల్సిన అవసరం ఉందన్నారు. మూడు లక్షల మందితో వందేళ్ల విజయోత్సవ సభ ఖమ్మంలో మూడు లక్షల మందితో విజయోత్సవ సభ జరుగుతుందన్నారు. ఖమ్మం, కొత్తగూడెం లో నుంచే 80 వేల మంది పాల్గొంటారన్నారు. వనపర్తి జిల్లా నుంచి 300 మంది ఖమ్మం విజయోత్సవ సభలకు హాజరవుతారన్నారు. వందేళ్ళ ఉత్సవ సభకు 40 దేశాల ప్రతినిధులు హాజరై సందేశాలు ఇస్తారన్నారు.

దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో ఖమ్మం లో వందేళ్ళ సభ జరుగుతుందన్నారు. ప్రజల మధ్య మతం పేరుతో ఐక్యతను దెబ్బతీసే ఆర్ఎస్ఎస్ కూడా వందేళ్ల సభను జరుపుకోబోతోందన్నారు. విప్లవ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ వచ్చిన నక్సలైట్లు దశలవారీగా ప్రభుత్వానికి సరెండర్ అవుతూ ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు దిశా నిర్దేశం చేసే సిపిఐ వందేళ్ళ ఉత్సవాలకు ప్రత్యేకత ఉందని పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, చంద్రయ్య, రమేష్, రాబర్ట్, మోష, శ్రీహరి, రవీందర్, గోపాల్, గోపాలకృష్ణ, కుతుబ్ కుర్మయ్య, కృష్ణవేణి, గీత తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సహాయం

### డాక్టర్ వృత్తి గొప్పది : మురళీధర్



**వనపర్తి,అక్టోబర్ 22( నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాజపేట గ్రామానికి చెందిన మోహన్ కుమార్ నీట్‌లో 383 మార్కులతో 6000 స్టేట్ ర్యాంక్ సాధించి జయశంకర్ భూపాలపల్లి మెడికల్ కాలేజ్‌లో సీటు పొందిన సందర్భంగా ప్రజా వైద్యుడు డా. మురళీధర్ విద్యార్థి హాస్టల్ ఫీజు కోసం 25,000 ఆర్థిక సహాయం అందించి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పట్టుదలతో కష్టపడితే యువత ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోగలదు. మోహన్ కుమార్ వంటి విద్యార్థులు వనపర్తికి గర్వకారణం," అన్నారు.కార్యక్రమంలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ ప్రేమ్‌నాథ్ రెడ్డి, శశిభూషణ్, రాఘవరెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బకాయిలు విడుదల చేయాలి

### -రాయికంటి శ్రీనివాస్



**మానకొండూరు, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

మానకొండూరు మండలం మానకొండూర్ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పనులను సందర్శించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్, ఎనిమిది వారాలుగా కూలీలకు కూలీ డబ్బులు అందకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు.పని ప్రదేశాల్లో వాటర్ టెంట్, వైద్య కిట్లు, ఓఆర్ఎస్ పాకెట్లు వంటి వేసవి సౌకర్యాలు కల్పించాలని, తక్షణమే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కూలీలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

### రైతులకు ఎమ్మెల్యే సూచన



**బెజ్జంకి, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

బెజ్జంకి మండలంలోని తోటపల్లి, ముత్తన్నపేట, కల్లేపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని పిలుపునిచ్చారు.రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, తేమ, తరుగు పేలిట కోతలు ఉండవని స్పష్టం చేశారు. గత పాలనలో రైతులకు నష్టం కలిగిన కోతలు కాంగ్రెస్ పాలనలో చోటుచేసుకోబోవని తెలిపారు. నిర్ణీత గడువులోగా చెల్లింపులు రైతు ఖాతాల్లోకి చేరుతాయని హామీ ఇచ్చారు.సన్న వడ్లు పండించే రైతులకు అదనంగా రూ.500 బోనస్ అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పులి కృష్ణ, ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్ రెడ్డి, అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, బైర సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

### భీమేశ్వరాలయంలో కోడె మొక్కులు, ఆర్జిత సేవలు ప్రారంభం



**వేములవాడ, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనుల నేపథ్యంలో, బుధవారం నుంచి కోడె మొక్కులు, ఇతర ఆర్జిత సేవలను భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. రాజన్న దర్శనాలు తాత్కాలికంగా నిలిపివేయడంతో భక్తులు భీమేశ్వరాలయంలో కోడె మొక్కులు చెల్లిస్తున్నారు. కార్తీక మాసం ప్రారంభమైన నేపథ్యంలో ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి కోటి రూపాయల చెక్కు




**నాగర్ కర్నూల్, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన 2009 బ్యాచ్ కానిస్టేబుల్ మహేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సమక్షంలో, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సునీత, అచ్చంపేట బ్రాంచ్ మేనేజర్ సయ్యద్ ఉసేన్ భాష చేతుల మీదుగా పోలీస్ శాలరీ ప్యాకేజీ ద్వారా మహేందర్ భార్య అంజలికి కోటి రూపాయల చెక్కు అందజేశారు. అలాగే, వెయ్యి రూపాయల ఇన్సూరెన్స్ పాలసీ కింద మహేందర్ తల్లి నిరంజనమ్మకు రూ.20 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి పోలీస్ అధికారి తప్పనిసరిగా ఇన్సూరెన్స్ పాలసీలు చేసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా ఈ పాలసీలను వార్షిక ప్రీమియంతో తీసుకుంటే, ప్రమాద సమయంలో కుటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎడిడిఎల్ఎస్పీ వెంకటేశ్వర్లు, ఏవో కృష్ణయ్య, ఆర్ఐ జగన్, సీసీ బాలరాజు, కానిస్టేబుల్ గోలి శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది, మరణించిన పోలీస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా తుల్జాభవాని మాత విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ప్రారంభం





**కడ్తాల్, అక్టోబర్ 22 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** శ్రీ తుల్జా భవాని మాత దేవాలయ దేవత విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా కడ్తాల్ మండలం గానుగుమార్ల పంచాయతీ పరిధిలోని కానుగుబాయి తండా లో బుధవారం గణపతి పూజ ,స్వస్తి పుణ్యా వచనం ,అఖండ దీపారాధన ,కుంకుమార్చన, గోపూజ ,యాగశాల ప్రవేశం మండప ధారణ , మరియు అమ్మవారి నూతన విగ్రహాన్ని స్థానిక వీధులగుంట ఊరేగిస్తూ మహిళలు పెద్ద ఎత్తున మంగళ దీపాలతో ఆలయానికి అమ్మవారి విగ్రహాన్ని తీసుకొచ్చారు. అనంతరం హెూమ కార్యక్రమాలు నిర్వహించారు. భిక్య నాయక్, పాండు, బిచ్యా నాయక్, నర్సింగ్, లక్ష్మణ్, నరేష్, జన్య . రాజు, దేవుల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ముదిగొండలో మద్యపానం, గంజాయి నిషేధం

### బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ




**దేవరకొండ అక్టోబర్ 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**

ఎం కె ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) దేవరకొండ నుంచి ఎన్ఎస్ఎస్ యూనిట్లు I & II విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఆరవ రోజులో భాగంగా ముదిగొండ గ్రామంలో మద్యపానం నిషేధం, గంజాయినీ తీసుకోవడం వలన కలిగే నష్టాలు అలాగే బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ టీచర్లు ,హై స్కూల్ టీచర్లు, గ్రామపంచాయతీ సెక్రటరీ సతీష్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ వి. మకట్లాల్ ఎస్కే.ఆరిఫా మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఏబివిపి ఆధ్వర్యంలో కొమరం భీమ్ జయంతి వేడుకలు



**దేవరకొండ అక్టోబర్ 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**

నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం ఏబివిపి విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ కొమరం భీమ్ ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహా వీరుడు. బ్రిటిష్ పాలనతో పాటు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గోండుల హక్కులు రక్షించడానికి ఆయన ధైర్యంగా ఎదిరించారు. "జల్,జంగల్, జమీన్ మా హక్కు" అనే నినాదంతో గిరిజనుల ఆస్తి, భూమి, అడవుల మీద హక్కుల కోసం ఆయన ఉద్యమాన్ని ప్రారంభించారు.భీమ్ పోరాటం ప్రజలకు న్యాయం తెచ్చే దిశగా సాగింది. ఆయన ధైర్యం, త్యాగం, నాయకత్వం వల్ల ఆయన పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.ఈ కార్యక్రమంలో నగర జాయింట్ సెక్రెటరీ యలమల హేమసుందర్ మరియు కార్యకర్తలు పగిళ్ల విక్రమ్, ఐత రాజు కొండ , రాకేష్ ,కళాశాల కమిటీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కు ఘన సన్మానం



**కడ్తాల్, అక్టోబర్ 22 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

కడ్తాల్ మండల నూతన తహశీల్దార్ జయశ్రీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మార్కెట్ మాజీ డైరక్టర్, బిఆర్ ఎస్ సీనియర్ నాయకుడు లాయక్ అలీ బదిలీపై వచ్చిన తహశీల్దార్ ను కలిసి శాలువాతో సన్మానించారు. మండలంలో నెలకొన్న రెవెన్యూ పనుల పరిష్కారానికి కృషి చేయాలని లాయక్ అలీ కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకుడు మంగళపల్లి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**కడ్తాల్, అక్టోబర్ 22 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్, ఆమనగల్లు మండలాల కాంగ్రెస్ నాయకులు బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి పలు అభివృద్ధి పనులు, నిధుల మంజూరు గురించి వినతి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే కు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# హైదరాబాద్ - శ్రీశైలం రహదారిని ఆరు లైన్లుగా విస్తరించాలి

## పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్



**కడ్తాల్, అక్టోబర్ 22 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించాలని కాంగ్రెస్ నాయకులు నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవిని కోరారు. బుధవారం ఈ మేరకు హైదరాబాదులోని ఆయన నివాసంలో మల్లురవిని కలిసి టీపీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, ఆమనగలు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ వినతి పత్రం అందజేశారు. రోడ్డు విస్తరించకపోవడం వల్ల వాహనాల రద్దీ పెరిగి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో శ్రీశైలం రోడ్డును మూడు లైన్లుగా విస్తరించడం జరిగిందన్నారు. ప్రస్తుతం వాహనాల రద్దీ ,ప్రయాణికుల రాకపోకలు 10 రెట్లు పెరిగాయి అన్నారు. అందుకు అనుగుణంగా జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ మల్లు రవి జాతీయ రహదారి విస్తరణ గూర్చి ఇప్పటికే కేంద్రమంత్రి గడ్కరిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా శ్రీశైలం రోడ్డు విస్తరణ గూర్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు మల్లురవి పేర్కొన్నట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# రౌడీ షీటర్లపై ఆకస్మిక తనిఖీ



**మాడుగుల, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: మాడుగుల మండలంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో అక్టోబర్ 22న రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్‌హెచ్ఓ వేణుగోపాల్, ఎస్ఐ నాగరాజు, ఎస్ఐ రాఘవేందర్ నేతృత్వంలో జరిగిన ఈ తనిఖీల్లో, వారి ప్రవర్తన, హాజరు, కదలికలు, సామాజిక కార్యకలాపాలను సమీక్షించారు. చట్ట విరుద్ధ చర్యలు చేపట్టకుండా కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల భద్రత, శాంతి కాపాడడంలో పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని, రౌడీ షీటర్లపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని ఎస్‌హెచ్ఓ స్పష్టం చేశారు.


# కొమురం భీమ్ స్ఫూర్తితో సమానత్వ సమాజం నిర్మాణమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## డిసిసి అధికార ప్రతినిధి - గూడూరు శ్రీనివాస్ రెడ్డి



**కడ్తాల్, అక్టోబర్ 22 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వీరుడు కొమురం భీమ్ జయంతి సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో ఫోటోకు పూలమాలలు వేసి వారి ఆశయాలను కొనసాగించాలని కోరుతూ నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి మరియు నాయకులు మాట్లాడుతూ కొమురం భీమ్ గిరిజనుల హక్కుల కోసం, అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో గిరిజనుల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన మహానాయకుడని అన్నారు. కొమరం భీం చూపించిన మార్గం నేటి తరానికి స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మరియు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గారి సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం, సమానత్వం, అభివృద్ధి సాధన దిశగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, ఐకమత్యం, సమానత్వం నెలకొల్పడమే నిజమైన నివాళి అవుతుందని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కొమురం భీమ్ చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఆయన త్యాగాలు స్ఫూర్తిగా తీసుకుని గిరిజనులు, బీసీలు, ఎస్సీలు, మైనార్టీలు అందరికీ సమాన న్యాయం జరిగే సమాజ నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్, డిసిసి ప్రధాన కార్యదర్శి భీఖ్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, మండల సేవాదళ్ అధ్యక్షులు లక్ష్మయ్య, మాలే మల్లేష్, సత్యం యాదవ్, యాదయ్య, శంకర్, వడ్డె రాజు, రవీందర్, పత్య నాయక్, జంగయ్య, మహేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఉసురు తీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: పాండురంగా రెడ్డి



**కందుకూరు, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లాడుతూ, మొక్కజొన్న రైతులు తీవ్రంగా దళారుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సుమారు 80 వేల ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్నకు గిరాకీ ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు వ్యాపారులు, దళారులకు తక్కువ ధరకు అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వర్షాల కారణంగా నిల్వ చేసే అవకాశం లేకపోవడంతో, రైతులు కల్లంలోనే పంటను అమ్ముతున్నారు. ఈ అవకాశాన్ని దళారులు వినియోగించుకుని, క్వింటాలుకు రూ.1900 నుంచి రూ.2000 మధ్య ధరకు కొనుగోలు చేస్తూ, రైతులను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర రూ.2300 ఉన్నప్పటికీ, కొనుగోలు ప్రక్రియ ప్రారంభించకపోవడం వల్ల రైతులు పెట్టుబడులు కూడా తిరిగి పొందలేకపోతున్నారని అన్నారు.రైతుభరోసా, రుణమాఫీ వంటి హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం, సమయానికి విత్తనాలు, ఎరువులు కూడా అందించలేకపోయిందని విమర్శించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర కల్పించడంలో విఫలమైన ఈ ప్రభుత్వం, ప్రజల బాధలను పట్టించుకోకుండా రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని మండిపడ్డారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రూ.2400 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

# గాంధీభవన్‌లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు శాలువా సన్మానం




**హైదరాబాద్, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) దళిత విభాగం నేషనల్ కోఆర్డినేటర్‌గా నిర్మితులైన ప్రీతం, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శాలువా, బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు పాండి పెంటయ్య, ఉపాధ్యక్షుడు నర్సింహా, వర్కింగ్ ప్రెసిడెంట్ జింకల భాస్కర్, పెద్ద అంబర్పేట్ మున్సిపల్ అధ్యక్షుడు చందుపట్ల యశశ్విన్, వర్కాల నాగరాజు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# పత్తి విక్రయానికి మొబైల్ నంబర్ తప్పనిసరి



**మాడుగుల, అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మాడుగుల మండలంలో పత్తి విక్రయానికి సంబంధించి రైతులకు కీలక సూచనలు చేశారు వ్యవసాయ శాఖ అధికారులు. అక్టోబర్ 22న నీలగిరి ఎక్స్‌ప్రెస్‌కు అందిన సమాచారం ప్రకారం, మండలంలోని రైతుల వివరాలు వారి పొలం పాసుబుకుల ఆధారంగా నమోదు చేశారు. అందులో ప్రతి రైతు తన పాసుబుక్ ఎదురుగా ఉన్న మొబైల్ నంబర్‌ను పరిశీలించాల్సి ఉంటుంది. నంబర్ సరైనదైతే ఎటువంటి సమస్య లేదు. అయితే తప్పుగా ఉన్నట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలి. సరైన నంబర్‌ను అందించిన రైతుల వివరాలు అధికారులచే నమోదు చేయబడతాయి. కిసాన్ కప్పాస్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేయాలంటే తప్పనిసరిగా మొబైల్ నంబర్ సరిగ్గా ఉండాలి. లేనిపక్షంలో పత్తి అమ్మకానికి అవకాశం ఉండదు. ఈ ప్రక్రియలో పాల్గొనదలచిన రైతులు అక్టోబర్ 24, 2025లోపు మాడుగుల మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ మొబైల్ నంబర్లను సమీక్షించి, అవసరమైన సవరణలు చేయాలని సూచించారు.

## గణేష్‌నగర్ ప్రసన్నాంజనేయ ఆలయంలో కార్తీక మాస పూజలు



**కరీంనగర్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పవిత్ర కార్తీక మాసం తొలి రోజున గణేష్‌నగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం వేదమంత్రోచ్చారణలతో మార్మోగింది. స్వామివారికి అభిషేకాలు, అలంకారాలు, హారతులు ఘనంగా నిర్వహించగా, భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి ఆధ్యాత్మిక తృప్తి పొందారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

## -టి.ఎస్.ఎస్.ఓ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్



**రంగారెడ్డి,అక్టోబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాష్ట్రంలో అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను తరలించే బస్సులను సరైన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుపుతున్నాయని, ఇది విద్యార్థుల ప్రాణాలకు ముప్పు అని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టి.ఎస్.ఎస్.ఓ) రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్ ట్రాన్స్పోర్ట్ శాఖ అధికారులు ప్రైవేట్ స్కూల్ బస్సులపై తక్షణ తనిఖీలు నిర్వహించి, ఫిట్‌నెస్ లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే స్కూల్ మేనేజ్‌మెంట్‌లను కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ప్రయాణించే బస్సుల స్థితిగతులు తెలుసుకోవాలని, అవసరమైతే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. “విద్యార్థుల భద్రతకు సంబంధించిన విషయాల్లో ఎటువంటి రాజీ ఉండరాదు” అని మీసాల లక్ష్మీనివాస్ స్పష్టం చేశారు.

# ఏఐసీసీ ఎస్సీ విభాగం జాతీయ కోఆర్డినేటర్‌గా నాగరి ప్రీతమ్



**మహేశ్వరం, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఏఐసీసీ ఎస్సీ విభాగం జాతీయ కోఆర్డినేటర్‌గా నియమితులైన నాగరి ప్రీతమ్‌ను రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహా శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వడ్డేమోని దర్శన్, సోలిపేట అనంతరెడ్డి, కాడిగళ్ళ శేఖర్, కట్టెల శేఖర్, గ్రామ శాఖ యువజన నాయకులు పాల్గొన్నారు. ప్రీతమ్ నియామకం పార్టీకి గౌరవాన్ని తీసుకురావడమే కాక, దళిత సమాజానికి ప్రాతినిధ్యాన్ని పెంపొందించేదిగా ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు.

# సదర్ సమ్మేళనానికి ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఆహ్వానం



**కుత్బుల్లాపూర్,అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి నగర్ డివిజన్ కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23న రంగారెడ్డి నగర్ పోచమ్మ దేవాలయం వద్ద నిర్వహించనున్న సదర్ సమ్మేళనానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ను ఆహ్వానిస్తూ సంఘ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, నిర్వాహకులు బాల్ రాజ్, రవి, నాయకులు వెంకటేష్, సల్లావుద్దీన్, సుధాకర్ తదితరులు పాల్గొని సమ్మేళన ఏర్పాట్లను సమీక్షించారు.

## ఓటు చోరికి వ్యతిరేకంగా ఎన్ఎస్‌యూఐ అవగాహన కార్యక్రమం



**కుతుబుల్లాపూర్,అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ (నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా) నాయకుడు గొల్ల జాన్ ఆధ్వర్యంలో కుతుబుల్లాపూర్ నియోజకవర్గంలోని ఐడీపీఎల్ ప్రాంతంలో ఓటు చోరికి వ్యతిరేకంగా సంతకాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ సంయుక్త కార్యదర్శి కుందన్ యాదవ్‌తో కలిసి మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కూన రాఘవేంద్ర గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. "ఒక ఓటు –ఒక విలువ" అనే నినాదంతో విద్యార్థులు చురుగ్గా పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ మద్దతు ప్రకటించారు. అనంతరం గొల్ల జాన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఎన్నికల పారదర్శకతను స్థాపించటం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ఓటు పవిత్రమైందని, ప్రతి ఓటరుని హక్కును రక్షించటం మన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయాలన్న బీజేపీ ప్రభుత్వ ప్రయత్నాలను ఏఐసీసీ నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ అడ్డుకుంటున్నారని, ఆయనకు అండగా ప్రతి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రజాస్వామ్య దేశంలో అత్యంత బలమైన శక్తి అని, దానిని అణచివేయడం ఎవ్వరి తరం కాదని స్పష్టం చేశారు.

# ఇబ్రహీంపట్నంలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇబ్రహీంపట్నం ప్రాంతంలో గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. 11 కె.వి. వైట్ గోల్డ్ మరియు అక్టోపుస్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించేందుకు, సబ్ స్టేషన్లలో నిర్వహిస్తున్న మరమ్మత్తుల కారణంగా ఈ అంతరాయం ఉంటుందని ఏఈ అఖిలేష్ తెలిపారు. వైట్ గోల్డ్ కంపెనీస్, వినోభా నగర్, సిద్ధార్థ కాలేజ్, గర్ల్స్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, అక్టోపుస్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయబడనుంది. కమర్షియల్ మరియు గృహ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా డిహెచ్పిఎస్ ఆవిర్భావ దినోత్సవం




**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లక్ష్మణ చారి భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్పిఎస్) 19వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పతాకావిష్కరణ కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొమ్ము భరత్, బండి లక్ష్మీపతి మాట్లాడుతూ, 2006 అక్టోబర్ 22న విశాఖపట్నంలో సామాజిక న్యాయం, దళిత ఐక్యత, రాజ్యాంగ హక్కుల సాధన, కుల నిర్మూలన లక్ష్యంగా డి హెచ్ పి ఎస్ ఏర్పాటైందని తెలిపారు. దళితులు ఇప్పటికీ అంటరానితనం, కుల వివక్ష, దోపిడి, హత్యాచారాలు, సామాజిక బహిష్కరణకు గురవుతున్నారని, విద్య, వైద్యం, ఉపాధి అందని ద్రాక్షలా మారాయని పేర్కొన్నారు. ప్రైవేటీకరణ వల్ల రిజర్వేషన్లు తగ్గిపోతున్నాయని, ఉపకులాలుగా విభజన కాకుండా విశాల ఐక్యత కోసం డి హెచ్ పి ఎస్ పోరాటం చేస్తోందన్నారు.కుల నిర్మూలనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమాలు నిర్వహిస్తున్న డి హెచ్ పి ఎస్, కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తూ, దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చిన్నపాగా శ్రీను, బాల పేరు, కొత్త రామస్వామి, మారడు శివశంకర్, గోపి, భూపేష్, లక్ష్మయ్య, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారంపై మంత్రి సమీక్ష



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో భూ సమస్యల పరిష్కార దిశగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. నవంబర్ 1 నుండి 30 వరకు గ్రామాల వారీగా తహసిల్దార్లు ఉదయం 8 గంటలకు గ్రామాల్లో సందర్శించి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై నిర్లిప్తత ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించేందుకు గ్రామాల్లో డప్పు చాటింపు, మైక్ ప్రకటనలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్, అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసిల్దార్లు పాల్గొన్నారు. భూ భారతి చట్టం అమలులోకి వచ్చినా ఆశించిన స్థాయిలో పరిష్కారాలు అందలేదని మంత్రి పేర్కొన్నారు. నవంబర్ 15 నాటికి 50% దరఖాస్తులు, నవంబర్ 30 నాటికి అన్ని దరఖాస్తులు పరిష్కరించాలని సూచించారు. అటవీ, దేవాదాయ భూముల సమస్యలపై సంబంధిత శాఖలతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని పెంచేలా అధికారులు కృషి చేయాలని, గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

# తిమ్మారెడ్డిపల్లిలో ఆటో కార్మికుడు ఆత్మహత్య

**కొండపాక, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో ఆటో కార్మికుడు ఈరోజు ఉదయం 10 గంటల సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ పోషణ భారంగా మారడంతో తీవ్ర మనోవేదనకు గురై ఈ దారుణానికి పాల్పడ్డాడని స్థానికులు తెలిపారు. అతనికి ముగ్గురు సంతానం ౨ ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు.ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఉచిత బస్సు విధానం వల్ల ఆటోపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడ్డాయని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ సిద్దిపేట జిల్లా ఆటో కార్మికుల అధ్యక్షుడు గోనెపల్లి సిద్దేశ్వర గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఆటో మృతి కింద ఇవ్వాల్సిన రూ.12,000 రెండు సంవత్సరాలుగా అందకపోవడం, ప్రభుత్వం హామీలను నెరవేర్చకపోవడం వల్ల ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న కార్మిక కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



**వెల్దండ, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని కుప్పగండ్ల మరియు బైరాపూర్ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ చర్యలలో భాగంగా టీకాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పశువైద్యాధికారి డాక్టర్ శ్యాంసుందర్ నేతృత్వంలో నిర్వహించారు.పశువైద్య సిబ్బంది నరేష్ రెడ్డి, నరసింహ, ఫణిందర్ రెడ్డి, శ్రీను, తిరుపతయ్యలతో పాటు గోపాలమిత్రులు బాలు, మొగులయ్య, సాయిబాబా, విజేందర్‌లు టీకా కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు విష్ణు, భరత్, చెన్నయ్య గౌడ్, రవి, రవీందర్ రెడ్డి, నారయ్య తదితరులు తమ పశువులను టీకా కోసం తీసుకువచ్చి సహకరించారు.

# శ్రీ ఉమామహేశ్వర దేవాలయ దర్శనంలో కట్ట సుధాకర్ రెడ్డి



**అచ్చంపేట, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేట పట్టణ పరిధిలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానాన్ని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి, శ్రీశైలం దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు కట్ట సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దేవుని ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అచ్చంపేట నియోజకవర్గ బీజేపీ నాయకులు మంగ్య నాయక్, బాలాజీ, రేనయ్య, నాగరాజ్, రామకృష్ణ రెడ్డి, ఆంజనేయులు, జానకి, నీల భాయ్, బీజేపీ రూరల్ మండల అధ్యక్షురాలు కాట్రావత్ జ్యోతి, నియోజక మండల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు తూప్రాన్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తూప్రాన్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తూప్రాన్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేయనున్న 5 ఎంవిఎ పీటీఆర్ (పవర్ ట్రాన్స్‌ఫార్మర్) ఏర్పాటుకు సంబంధించి శ్రేణి పనులు చేపట్టనున్న నేపథ్యంలో, సబ్‌స్టేషన్ మొత్తానికి విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. ఈ మేరకు గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు తూప్రాన్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకొని, విద్యుత్ శాఖకు సహకరించాలని తూప్రాన్ ఆపరేషన్ విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీమాన్ తెలిపారు.

# హుస్నాబాద్ మార్కెట్‌కు రెగ్యులర్ కార్యదర్శి అవసరం



**సిద్దిపేట, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రెండో గ్రేడ్ హుస్నాబాద్ మార్కెట్‌కు రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో జరిగిన అవినీతి ఘటనల అనంతరం ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసినప్పటికీ, ఇప్పటివరకు రెగ్యులర్ నియామకం జరగలేదని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల ఇష్టారాజ్యం, సూపర్వైజర్ నిర్లక్ష్యం వల్ల రైతులు దోపిడీకి గురవుతున్నారని, ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## కార్తీక మాసోత్సవాలకు జ్యోతి వెలిగించి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసోత్సవాలను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి బుధవారం వేయి స్తంభాల దేవాలయంలో జ్యోతి వెలిగించి ఘనంగా ప్రారంభించారు. ప్రారంభానికి ముందు నాయిని దంపతులు రుద్రేశ్వర స్వామి వారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, "కార్తీక మాసం శైవ భక్తులకు మాత్రమే కాక, ప్రతి హిందువుకూ పవిత్రమైన కాలం. పరమశివుని ఆరాధనకు ఈ మాసం అత్యంత అనుకూలం. భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగిస్తూ, శివాలయాలకు వచ్చి పూజలు చేయాలి. మన సంస్కృతి, సంప్రదాయాలను బలంగా నిలబెట్టే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి. ఈ మాసం అందరికీ శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యాన్ని ప్రసాదించాలి" అని ఆకాంక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూజా కార్యక్రమాలకు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ సంపత్, ఆలయ కార్యనిర్వాహక అధికారి అనిల్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, నాయకులు కుమార్ యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## శృంగేరి పీఠాధిపతి ఆశీస్సులు పొందిన కేంద్ర మంత్రి బండి సంజయ్

### బకాయిల చెల్లింపుపై ప్రభుత్వానికి అల్టిమేటం



**హైదరాబాద్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం నల్లకుంట శంకర్ మఠ్‌ను దర్శించి, శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతి స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, విద్యార్థుల, యాజమాన్యాల భవిష్యత్తును బకాయిల పేరుతో బ్లాక్ మెయిల్ చేయడం సరికాదని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 'బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బెదిరింపులు చేస్తారా? అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను కాలరాస్తారా? కమీషన్లు రావడం లేదనే సాకుతో బకాయిలు చెల్లించకపోవడం దారుణం. విద్యార్థుల భవిష్యత్తు కోసం తక్షణమే బకాయిలు చెల్లించాలి. లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవు" అని హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ బకాయిల అంశంపై కూడా రోడ్డెక్కే పోరాటం తథ్యమని స్పష్టం చేశారు. "యాజమాన్యాలు ప్రభుత్వానికి భయపడి సమ్మె విరమిస్తే, భవిష్యత్తులో మీకు అండగా నిలిచే పరిస్థితి ఉండదు. విద్యార్థులు, యాజమాన్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయాల్సిన పరిస్థితి వస్తుంది" అని బండి సంజయ్ పేర్కొన్నారు. బీహార్ ఎన్నికలకు నిధులు ఇక్కడి నుంచే వెళ్తున్నాయన్న ఆరోపణలతో పాటు, పదేపదే హామీలు ఇచ్చి తప్పుతున్న అధికారులపై ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

## ములుగు ఎస్పీ ఎదుట లొంగిపోయిన నలుగురు మావోయిస్టులు




**ములుగు, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన నలుగురు సభ్యులు ు మాడవి కోసి, మాడవి ఇడుమే, మచ్చకి దేవా, మడకం బండి ు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఎదుట లొంగిపోయారు. లొంగుబాటు చేసిన ప్రతి ఒక్కరికి ఎస్పీ రూ.25,000 తక్షణ సహాయం అందించారు. అజ్ఞాత జీవితం విడిచిపెట్టి పోలీసులను సంప్రదించే వారికి ఎటువంటి హాని ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు.

## బేతిగల్-కరీంనగర్ నూతన బస్ సర్వీసు ప్రారంభం

### 30 ఏళ్ల కల నెరవేరిన వేళ - గ్రామస్థుల ఆనందం



**హుజురాబాద్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జమ్మికుంట-బేతిగల్-కేశవపట్నం మీదుగా కరీంనగర్ వరకు నూతన బస్ సర్వీసును హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బుధవారం ప్రారంభించారు. 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న బస్ సౌకర్యం అందడంతో గ్రామస్థులు బాణాసంచా కాల్చి ఘనస్వాగతం పలికారు. ప్రతిరోజూ రెండు సార్లు నడిచే ఈ సర్వీసు విద్యార్థులకు, మహిళలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్ ప్రయాణం కల్పిస్తున్నామని ప్రణవ్ తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**
వీణవంక మండలంలోని బేతిగల్, వల్భాపూర్ గ్రామాల్లో రూ.3,15,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. చెక్కులను వెంటనే బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు.

## మైనారిటీ యువతకు నైపుణ్య శిక్షణ కోసం ప్రతిపాదనలు కోరుతున్న జిల్లా అధికారులు



**మంచిర్యాల, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని నిరుద్యోగ మైనారిటీ (ముస్లిం, బౌద్ధ, పార్సి, సిక్కు, జైన) యువతకు స్వల్పకాలిక నైపుణ్య అభివృద్ధి శిక్షణ అందించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల నుండి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నట్లు జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి తెలిపారు. నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అనుబంధ సంస్థల ద్వారా ఉచిత శిక్షణ కల్పించనున్న ఈ కార్యక్రమంలో, ఎంపికైన సంస్థలు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంటుంది. సంస్థలు తమ ప్రతిపాదనలను నవంబర్ 6వ తేదీలోగా నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయం, ఎఫ్-5లో సమర్పించాలి. ప్రతిపాదనలతో పాటు సంస్థ రిజిస్ట్రేషన్, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ అనుబంధత, ఆదాయ పన్ను రిటర్న్లు, శిక్షణ విజయ గాథలు, ఉపాధి రికార్డులు, శిక్షణ కేంద్రాల వివరాలు, సిబ్బంది అర్హతల జాబితా వంటి వివరాలు తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు.

## పత్తి కొనుగోలు ప్రక్రియపై సమీక్ష

### -సి.ఎం.ఆర్. లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి: - కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో నవంబర్ 1వ తేదీ నుండి పత్తి కొనుగోలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో సి.సి.ఐ. అధికారులు, జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. రైతులు దళారులకు మోసపోకుండా, కనీస మద్దతు ధరతో సి.సి.ఐ. కేంద్రాల్లో పత్తిని విక్రయించాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్, ఆధార్ ఆధారిత ధ్రువీకరణ, తేమ శాతం 12% లోపు ఉండే పత్తి మాత్రమే కొనుగోలు చేయాలన్న నిబంధనలను కలెక్టర్ వివరించారు. ఇతర రాష్ట్రాల పత్తి రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు అలాగే, 2024-25 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. డెలివరీ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. లక్ష్యాలు పూర్తి చేయని మిల్లులకు ధాన్యం కేటాయించబోమని స్పష్టం చేశారు. బ్యాంక్ గ్యారంటీలు, ఒప్పందాలు సమర్పించాలని తెలిపారు. ఈ రెండు సమావేశాల్లో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, వ్యవసాయ అధికారి సురేఖ, మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, మేనేజర్ శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ అవినీతిపై మిల్లర్ యజమానులపై చర్యలు తీసుకోవాలి: కవ్వ వేణుగోపాల్ రెడ్డి





**హుస్నాబాద్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గత సంవత్సరం సీసీఐలో చోటుచేసుకున్న అవినీతిపై మిల్లర్ యజమానులపై ఇప్పటికీ క్రిమినల్ కేసులు నమోదు చేయకపోవడం దురదృష్టకరమని భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయడం కంటి తుడుపుగా మారిందని, అసలు బాధ్యులైన మిల్లర్ యజమానులపై విజిలెన్స్ లేదా ఎన్ఫోర్స్మెంట్ ద్వారా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి అండదండలతో మిల్లర్ యజమానులు తప్పించుకుంటున్నారా అనే అనుమానాలు వ్యక్తం చేశారు. రైతులను నిలువు దోపిడీ చేసిన మిల్లర్ యజమానులు, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే మళ్లీ అదే దోపిడీ పునరావృతమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికైనా చిత్తశుద్ధితో స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## హుస్నాబాద్ మార్కెట్ యార్డ్‌లో ధాన్యం కొనుగోళ్లపై పరిశీలన

### రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్



**హుస్నాబాద్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ఇప్పటివరకు కేవలం 2,500 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు జరగగా, యార్డ్‌లో 8,000 క్వింటాళ్ల వరకు నిల్వ ఉంది. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో, నాణ్యమైన గొనె సంచులు, తారీపిన్ కవర్స్, పాడి క్లీనర్లు అందించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, లేకుంటే రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొజ్జ హరీష్, యూత్ పట్టణ అధ్యక్షుడు మేకల వికాస్ యాదవ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల ముఖ్యనాయకులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, ప్రజలకు నాణ్యమైన గృహాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి గోదావరిలో కార్తీక స్నానాలు

**-స్వాతి నక్షత్ర నారసింహుడికి ప్రత్యేక పూజలు**



**జగిత్యాల, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో దక్షిణ వాహినిగా ప్రవహిస్తున్న గోదావరిలో బుధవారం కార్తీక మాసం తొలి రోజు భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉదయాన్నే గోదావరి తీరానికి చేరుకుని సంతోషిమాత, శ్రీ దత్తాత్రేయ స్వామిని దర్శించి, అనంతరం శ్రీ లక్ష్మీనరసింహుని దర్శించుకున్నారు. అదే రోజు స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాటుకు పంచామృతాభిషేకం, వేదమంత్రోచ్చారణల మధ్య అర్చనలు, పుష్పమాలలతో అలంకరణ, అష్టోత్తర శతనామార్చనలు, ధూపదీప నివేదన, హారతులతో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. కనకాంబర, పట్టుపీతాంబర ధారణతో నారసింహుడు భక్తులను అనుగ్రహిస్తున్నాడు.

# అల్ఫోర్స్ స్కూల్‌లో అండర్-17 చెస్ ఎంపిక పోటీలు ఘనంగా

**విజేతలు జోనల్ స్థాయికి అర్హత**



**కరీంనగర్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-17 బాల, బాలికల చెస్ ఎంపిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, చెస్ క్రీడ మేధస్సును పదును పెట్టే ఆటగా, ప్రపంచవ్యాప్తంగా క్రేజ్ ఉన్నదిగా పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల క్రీడా అభివృద్ధికి విశ్వవిద్యాలయం స్థాపించడం గొప్ప అవకాశమని కొనియాడారు. ప్రారంభ సందర్భంగా ట్రైల్ గేమ్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, జీనియస్ ఎస్ అకాడమీ నిర్వాహకుడు కొంకటి అనుప్, పాఠశాలల ప్రతినిధులు, టీం మేనేజర్లు, పరిశీలకులు, ఆర్బిటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ఎంపికైన 5 మంది క్రీడాకారులు రేపు జగిత్యాలలో జరిగే జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

# పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో ప్రజల భాగస్వామ్యం కోసం పోటీల ప్రకటన



**కరీంనగర్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రజల కోసం ప్రత్యేక పోటీలు నిర్వహించనున్నట్లు పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థుల కోసం అక్టోబర్ 22 నుండి 28వ తేదీ వరకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. "డ్రగ్స్ నిర్వహణ: నివారణలో పోలీసుల పాత్ర మరియు విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు" అనే అంశంపై తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో వ్యాసాలు స్వీకరించనున్నారు. విద్యార్థులు తమ రచనలను లింక్ ద్వారా అప్‌లోడ్ చేయవచ్చు. ప్రతి భాషలో టాప్ ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నారు.అలాగే, ప్రజల కోసం పోలీసులకు సంబంధించిన అంశాలపై షార్ట్ ఫిల్మ్ పోటీలు, ఫోటోగ్రఫీ పోటీలు కూడా నిర్వహించనున్నారు. పోటీదారులు తమ ఫిల్మ్, ఫోటోలను అక్టోబర్ 28వ తేదీ వరకు పోలీస్ కమీషనర్ కార్యాలయంలోని ఐటీ కోర్ విభాగంలో సమర్పించవచ్చు. ఈ పోటీల్లోనూ టాప్ ముగ్గురికి బహుమతులు అందజేయనున్నారు.పోలీస్ అమరవీరుల వారోత్సవాలను ప్రజల భాగస్వామ్యంతో మరింత విజయవంతంగా నిర్వహించేందుకు విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని కమీషనర్ గౌష్ ఆలం పిలుపునిచ్చారు.

# రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**వేములవాడ, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామంలో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.రైతులకు మద్దతు ధరతో పాటు, నాణ్యమైన విద్యుత్, ఎరువులు, వంగడాలు అందిస్తున్నామని, 20 వేల కోట్ల రుణమాఫీని ఏకకాలంలో అమలు చేశామని తెలిపారు. సన్న వడ్లకు ప్రతి క్వింటాల్‌కు రూ.500 బోనస్, నూతన లారీ ఏజెన్సీల ద్వారా ధాన్యం పంపిణీ, పేదలకు సన్న బియ్యం పంపిణీ వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు.కోనరావుపేట మండలం కనగర్తి, చందుర్తి మండలం సనుగుల, వట్టిమల్ల గ్రామాల్లో కూడా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. "దేశానికి పెట్టేడు అన్నం పెట్టేది రైతన్నే. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి కొనసాగుతోంది," అని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# బుధవారం బోధనతో కఠినమైన పాఠ్యాంశాలపై దృష్టి

**కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యార్థులకు కఠినమైన పాఠ్యాంశాలను అర్థవంతంగా నేర్పించేందుకు "బుధవారం బోధన" కార్యక్రమం ఉపకరిస్తుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్షేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఆమె, 9వ తరగతి విద్యార్థులతో కలిసి పాఠాలు చదివించారు. రైటింగ్ తీరును పరిశీలించి, ప్రతి విద్యార్థికి స్పష్టతతో చదవడం ఎలా అనే విషయంపై మెళకువలు నేర్పారు. బుధవారం బోధనలో కఠినమైన పాఠాలను ఎంచుకొని శ్రద్ధతో నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ కఠినమైన అంశాలపై దృష్టి పెట్టాలని ఆమె ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్, ఆకుకూరలు, గుడ్లు తప్పకుండా తీసుకోవాలని, పోషక విలువలపై అవగాహన కల్పించారు. చేతులు కడుక్కునే చోట నల్లాలు లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే ఏర్పాటు చేయాలని విద్యాధికారిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజేష్, ఎంఈఓ రవీందర్ పాల్గొన్నారు.

# గోదావరిలో మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి వివేక్



**చెన్నూరు, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కోటపల్లి మండలం రొయ్యలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త దగాం శ్రీశైలం గోదావరిలో స్నానం చేస్తుండగా గల్లంతై మృతి చెందారు. ఈ విషాద ఘటనపై కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీకి అంకితభావంతో సేవలందించిన శ్రీశైలం మరణం కాంగ్రెస్ కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు.

**మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి**

ధర్మారం మండలం కటికేనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బోనగిరి పెద్దుల భార్య బోనగిరి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా మంత్రి వివేక్ వెంకటస్వామి ఈరోజు కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె ఫోటోకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాడే సూర్యనారాయణ, కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, పాలకుర్తి రాజేశం గౌడ్, పొన్నం కృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జాగృతిలో మహిళల చేరిక



**కరీంనగర్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాగృతి అధ్యక్షురాలు కవిత నాయకత్వానికి మద్దతుగా కరీంనగర్ బ్యూటీ అసోసియేషన్ అధ్యక్షురాలు రూపతో పాటు పలువురు మహిళలు జాగృతిలో చేరారు. మహిళా రిజర్వేషన్ సాధనలో కవిత పోరాటం దేశవ్యాప్తంగా స్ఫూర్తిదాయకమని జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.ప్రభుత్వం మహాలక్ష్మి, కళ్యాణలక్ష్మి, పింఛన్, డ్వాక్రా, స్కూటీ హామీలను నెరవేర్చకుండా మహిళలను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు అక్కం శివరాణి, కోత్తురి రఘు, విజయ, అనుష, కవిత, శ్రీమతి, జ్యోతి, అనిష, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# యాదవుల రాజకీయ శిక్షణ శిబిరానికి పిలుపు



**కరీంనగర్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ ఉమ్మడి జిల్లా యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీల్లో మానకొండూరు మండలం కాదరగూడెం గ్రామంలోని అరవింద్ ఫామ్‌లో యాదవుల రాజకీయ శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. రాబోయే సంస్థల ఎన్నికల్లో యాదవులు పోటీ చేసి రాజకీయంగా ఎదగాలని, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీపీ పదవులు సాధించాలని జిల్లా అధ్యక్షుడు బండి మల్లేష్ యాదవ్ పిలుపునిచ్చారు.తెలంగాణలో రెండో అత్యధిక జనాభా కలిగిన వర్గంగా ఉన్న యాదవులు, గొర్లకు బర్లకు కాకుండా అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన సౌగాని కొమురయ్య యాదవ్‌ను అభినందిస్తూ, ఆయనకు ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జంగా కొమురయ్య యాదవ్, ఉడుత రత్నాకర్ యాదవ్, నరసయ్య యాదవ్, వేణు యాదవ్, సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వీబీ ఫౌండేషన్‌కు చేరిన అనాథ వృద్ధురాలు



**కరీంనగర్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అపోలో ఆసుపత్రి సమీపంలో ఎండ, వాన, చలికి తట్టుకుని రోడ్డుపైనే జీవిస్తున్న ఓ 70 ఏళ్ల అనాథ వృద్ధురాలిని కరీంనగర్ రూరల్ పోలీసులు చేరదీసి వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధాశ్రమం (వీబీ ఫౌండేషన్)కు అప్పగించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఏ భాష మాట్లాడుతుందో తెలియకపోయినా, రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి సహకారంతో ఆశ్రమ నిర్వాహకుడు సీపెల్లి వీరమాధవ్‌కు అప్పగించారు. గత 22 ఏళ్లుగా అనాథ వృద్ధుల కోసం సేవలందిస్తున్న వీరమాధవ్‌ను పోలీసులు అభినందించారు.

# ఘనంగా పోలీసు స్మారక దినోత్సవం



**కరీంనగర్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బందిని స్మరించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్లో ఫ్లాగ్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మానకొండూర్‌లోని దివంగత శ్రీ సంజీవ్ విగ్రహానికి పూలమాల వేసి, ఆయన సేవలకు ఘన నివాళులు అర్పించారు.

# పవన్ కల్యాణ్‌లా తెలివైన నిర్ణయం తీసుకో..

## నటుడు విజయ్‌కి అన్నాడీఎంకే సీనియర్ నేత సలహా

**న్యూఢిల్లీ అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తమిళనాడు లో రాజకీయాల్లో ప్రవేశించిన ప్రముఖ నటుడు విజయ్ కి అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్‌బీ ఉదయకుమార్ కీలక సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మెగాస్టార్ చిరంజీవి చేసిన రాజకీయ పొరపాటును పునరావృతం చేయవద్దని, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తరహాలో సరైన సమయంలో పొత్తులపై నిర్ణయం తీసుకోవాలని హితవు పలికారు.అన్నా డీఎంకే కూటమిలో చేరకపోతే విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) రాజకీయంగా కనుమరుగవడం ఖాయమని ఉదయ్‌కుమార్ హెచ్చరించారు. మధురైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఉదయకుమార్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అవినీతి డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె



దించడమే లక్ష్యంగా బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని తెలిపారు.తమ కూటమిలో చేరేందుకు మరిన్ని పార్టీలు సిద్ధంగా ఉన్నాయని, ఇదే సమయంలో విజయ్ కూడా తమతో కలవాలని ఆహ్వానించారు. అన్నాడీఎంకే మెగా కూటమిలో టీవీకే చేరడానికి ఇదే సరైన సమయమని చెప్పారు. ఈ అవకాశాన్ని విజయ్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ కూటమిలో చేరకపోతే ఎన్నికల తర్వాత డీఎంకే ఆ పార్టీని నాశనం చేస్తుందని జోస్యం చెప్పారు.ఒంటరిగా బరిలో దిగితే టీవీకే అడ్రస్ లేకుండా పోతుందని ఉదయకుమార్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పరిణామాలను ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో చిరంజీవి పార్టీ పెట్టినప్పుడు పొత్తులపై సరైన నిర్ణయం తీసుకోలేకపోయారని, కానీ పవన్ కల్యాణ్ సరైన సమయంలో సరైన పొత్తు నిర్ణయంతో పార్టీని నిలబెట్టుకోవడమే కాకుండా ఉప ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు.తన మాటను విజయ్ గుర్తుపెట్టుకోవాలని, డీఎంకే మళ్లీ అధికారంలోకి వస్తే విజయ్‌ను దేవుడు కూడా కాపాడలేడని ఉదయ్‌కుమార్ వ్యాఖ్యానించారు.

# శ్రీలంకలో ఘోరం..
# పట్టపగలే ప్రతిపక్ష నేత దారుణ హత్య

**న్యూఢిల్లీ అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పొరుగు దేశం శ్రీలంక లో పట్టపగలే ఘోరం జరిగింది. ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓ రాజకీయ నాయకుడి ని ఆయన కార్యాలయంలోనే ఓ దుండగుడు కాల్చి చంపాడు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. శాంతిభద్రతలను పునరుద్ధరిస్తామని హామీ ఇస్తూ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక రాజకీయ నాయకుడు హత్యకు గురికావడం కలకలం రేపింది.వివరాల్లోకి వెళ్తే.. వెలిగమ నగర కౌన్సిల్ చైర్మన్, ప్రతిపక్ష సమగి జన బలవేగయ పార్టీకి చెందిన లసంత విక్రమశేఖర (38) బుధవారం తన కార్యాలయంలో ప్రజలతో సమావేశమయ్యారు. అదే సమయంలో లోపలికి దూసుకొచ్చిన ఓ ఆగంతకుడు రివాల్వర్‌తో ఆయనపై పలుమార్లు కాల్పులు జరిపాడు.




ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన విక్రమశేఖర అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.దాడి సమయంలో కార్యాలయంలో ఇతరులు ఉన్నప్పటికీ వారికి ఎలాంటి హాని జరగలేదు. కాల్పులు జరిపిన వెంటనే నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ హత్య వెనుక ఉన్న కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు చెప్పారు. హంతకుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా వెలిగమ కౌన్సిల్‌పై ఆధిపత్యం కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్రమైన రాజకీయ పోరు నడుస్తోందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. గత కొంతకాలంగా శ్రీలంకలో హింసాత్మక ఘటనలు, వ్యవస్థీకృత నేరాలు గణనీయంగా పెరిగిపోయాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 100కి పైగా కాల్పుల ఘటనలు జరగ్గా వాటిలో దాదాపు 50 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.ఈ ఏడాది ఫిబ్రవరిలో న్యాయవాది వేషంలో వచ్చిన ఓ దుండగుడు కొలంబో కోర్టు హాలులోనే ఓ నిందితుడిని కాల్చి చంపిన ఘటన దేశంలో శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోంది. తాజా రాజకీయ హత్యతో ప్రజల్లో భయాందోళనలు మరింత పెరిగాయి.

# ఇండియన్ రూపీకి రిజర్వ్ బ్యాంక్ అండ..

### రూపాయి బలోపేతం కోసం భారీగా చర్యలు

**న్యూఢిల్లీ అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమెరికా కఠిన నిర్ణయాలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న భారత రూపాయి కి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అండగా నిలిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత దిగజారకుండా నిరోధించేందుకు భారీ ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు నెలలో ఏకంగా 7.69 బిలియన్ అమెరికన్ డాలర్లను (సుమారుగా రూ.67 వేల కోట్లు) మార్కెట్లో విక్రయించినట్లు ఆర్బీఐ తన తాజా బులెటిన్‌లో వెల్లడించింది.ఇటీవల డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 88కి పడిపోయింది. ఆగస్టు నెలలో రూపాయి విలువ 1.6 శాతం వరకు క్షీణించడంతో కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. సాధారణంగా మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరిగినప్పుడు రూపాయి




బలహీనపడుతుంది. అలాంటప్పుడు ఆర్బీఐ తన విదేశీమారక నిల్వల నుంచి డాలర్లను అమ్ముతుంది. దాంతో మార్కెట్లో డాలర్ల సరఫరా పెరిగి, రూపాయి విలువ స్థిరపడుతుంది. జూలై నెలతో పోలిస్తే ఆగస్టులో ఆర్బీఐ విక్రయించిన డాలర్లు ఏకంగా మూడు రెట్లు అధికం కావడం గమనార్హం. మార్కెట్లో తీవ్రమైన అనిశ్చితి ఉన్నప్పుడు మాత్రమే తాము జోక్యం చేసుకుంటామని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఒకవైపు డాలర్లను విక్రయిస్తూనే మరోవైపు ఆర్బీఐ వ్యూహాత్మకంగా బంగారం నిల్వలను పెంచుకుంటోంది. రెండు నెలల విరామం తర్వాత సెప్టెంబర్‌లో కొత్తగా 200 కిలోల పసిడిని కొనుగోలు చేసింది.దాంతో ఆర్బీఐ దగ్గరున్న మొత్తం బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. వాటి విలువ సుమారు రూ. 8.36 లక్షల కోట్లుగా ఉంది. ఏ దేశ కేంద్ర బ్యాంకు వద్దనైనా బంగారం నిల్వలు ఎక్కువగా ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ, కరెన్సీపై అంతర్జాతీయంగా నమ్మకం పెరుగుతుంది. సంక్షోభ సమయాల్లో బంగారం సురక్షితమైన ఆస్తిగా పనిచేస్తుంది. విదేశీ మారక నిల్వల్లో డాలర్ల వంటి కరెన్సీలు ఉన్నప్పటికీ, బంగారం నిల్వలు ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని ఇస్తాయి. అధిక బంగారం నిల్వలు దేశ రేటింగ్ మెరుగుపడటానికి కూడా దోహదపడతాయి. తద్వారా తక్కువ వడ్డీకే అంతర్జాతీయ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ చేపడుతున్న ద్వంద్వ వ్యూహం రూపాయిని బలోపేతం చేయడానికేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు: సింగిరెడ్డి కృష్ణారెడ్డి

**కరీంనగర్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జీఎస్టీ పన్నుల తగ్గింపు వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. సబ్బులు, పేస్టులు నుంచి సిమెంట్, టీవీలు, మోటార్ సైకిళ్లు, కార్లు, ట్రాక్టర్లు, వరి కోత మిషన్ల వరకు ధరలు తగ్గడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ చొప్పదండి పట్టణ అధ్యక్షులు చిల్ల శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వ్యాపార సంస్థలను సందర్శించి జీఎస్టీ అమలు తీరు పరిశీలించారు. దుకాణాల నిర్వాహకులు ధరలు తగ్గడంతో అమ్మకాలు పెరిగాయని తెలిపారు. సిమెంట్ బస్తా ధర రూ.20-30 తగ్గిందని వినియోగదారులు పేర్కొనగా, స్కూటర్ కొనుగోలుపై రూ.10,000



వరకు లాభం కలిగిందని కొనుగోలుదారులు తెలిపారు. నిత్యావసరాలపై నెలకు రూ.500-1000 ఆదా అవుతోందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.జీఎస్టీ లాభాలు ప్రజలకు అందిస్తున్నందుకు బీజేపీ నాయకులు వినియోగదారులను మిఠాయి తినిపించి శాలువా కప్పి సన్మానించారు. వ్యాపారులు జీఎస్టీ లాభాలను ఖచ్చితంగా ప్రజలకు అందించాలనే బాధ్యత తీసుకోవాలని సింగిరెడ్డి కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, చొప్పదండి రూరల్ శాఖ అధ్యక్షులు మొగిలి మహేష్, గుండేటి శివ, జిట్ట కుమార్, తాదూరి రామకృష్ణ, గుండె వెంకటేష్, అర్ధవెల్లి శ్రీను, స్వర్గం కళ్యాణ్, గుజ్జేటి శ్రీకాంత్, పెద్ది సాగర్, బొడిగె శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.


## లెఫ్టినెంట్ కల్నల్‌గా నీరజ్ చోప్రా



**న్యూఢిల్లీ అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత మేటి జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా కు అరుదైన గౌరవం దక్కింది. జావెలిన్ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాకు భారతీయ ఆర్మీలో గౌరవప్రదమైన లెఫ్టినెంట్ కల్నల్ ర్యాంక్‌ను అందజేశారు. ఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో ఆయన్ను ఆ ర్యాంక్‌తో సన్మానించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నీరజ్ చోప్రా కుటుంబం కూడా ఈ ఈవెంట్‌ను ప్రత్యక్షంగా వీక్షించింది.పట్టుదలకు, దేశభక్తికి నీరజ్ చోప్రా నిదర్శనమని రాజ్‌నాథ్ అన్నారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం నీరజ్ చోప్రా నియామకం ఏప్రిల్ 16వ తేదీన జరిగింది. జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్‌గా నయిబ్ సుబేదార్ ర్యాంకుతో నీరజ్ చోప్రా 2016 ఆగస్టులో భారతీయ సైన్యంలో చేరారు. నీరజ్ చోప్రాకు గతంలో పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న , అర్జున అవార్డులు దక్కాయి. పరమ విశిష్ట సేవా మెడల్, విశిష్ట సేవా మెడల్ కూడా ఆయన గెలుచుకున్నారు.2020లో టోక్యోలో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వర్ణ పతకం గెలుచుకుని చరిత్ర సృష్టించారు. ఆ తర్వాత 2024 పారిస్ ఒలింపిక్ క్రీడల్లో రజత పతకం సాధించాడు. 2023 వరల్డ్ అథ్లటిక్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాడు. ఏషియన్, కామన్‌వెల్త్ గేమ్స్‌తో పాటు డైమండ్ లీగ్‌ల్లోనూ అతను స్వర్ణ పతకాలు గెలుచుకున్నాడు. నీరజ్ చోప్రా తన జావెలిన్‌ను అత్యుత్తమంగా 90.23 మీటర్ల దూరం విసిరి రికార్డు సృష్టించాడు. నీరజ్ సాధించిన విజయాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ కీర్తించారు. రాబోయే తరాలకు ఇన్‌స్పిరేషన్‌గా ఆయన నిలుస్తారన్నారు. పట్టుదలకు, క్రమశిక్షణకు నీరజ్ ఆదర్శప్రాయుడన్నారు

## వైట్‌హౌజ్ వద్ద భద్రతా లోపం..

### బ్యారికేడ్లను ఢీకొట్టిన కారు



**వాషింగ్టన్ అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమెరికా శ్వేత సౌధం వద్ద భద్రతా లోపం ఘటన జరిగింది. వైట్‌హౌజ్ సెక్యూర్టీ చెకింగ్ పాయింట్ బ్యారికేడ్లను ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ ఘటన జరిగిన సమయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లోపలే ఉన్నట్లు తెలిసింది. మంగళవారం రాత్రి 10.30 నిమిషాల సమయంలో ఈ ఘటన జరిగింది. 17వ, ఈ స్ట్రీట్ మధ్య ఉన్న బారికేడ్లను కారు ఢీకొట్టింది. 2010 అకురా టీఎస్‌ఎక్స్ మేరీల్యాండ్ లైసెన్స్ ప్లేట్‌తో ఆ కారు ఉన్నట్లు గుర్తించారు.భద్రతా అధికారులు తక్షణమే ఆ ప్రదేశానికి చేరుకుని కారును సీజ్ చేశారు. సీక్రెట్ సర్వీస్ ఆఫీసర్లు డ్రైవర్‌ను తక్షణమే అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ ఎవరన్న దానిపై ఇంకా క్లారిటీ లేదు. కావాలని శ్వేత సౌధాన్ని ఢీకొన్నాడా లేక అనుకోకుండా ప్రమాదం జరిగిందో లేదో తెలియదు. వైట్‌హౌజ్ రోడ్డు మార్గాన్ని మూసివేశారు. వైట్‌హౌజ్‌లోని ఈస్ట్ వింగ్‌లో ప్రస్తుతం మరమ్మత్తులు జరుగుతున్నాయి.ఇటీవల వైట్‌హౌజ్ గేట్లను వాహనాలు ఢీకొన్న ఘటనలు జరిగాయి. గత ఏడాది జనవరి, మే నెలల్లో వైట్‌హౌజ్‌ను ఢీకొన్న ఘటనలు జరిగాయి. ఇక మే 2023లో కూడా ఓ డ్రైవర్ తన ట్రక్కుతో వైట్‌హౌజ్‌పై దూసుకెళ్లాడు.

## గంగాధరలో శ్రీ వాసవి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**కరీంనగర్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండల కేంద్రం మధుర నగర్ చౌరస్తాలో శ్రీ వాసవి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య రోజున అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్వో అంబట్ల రజిత చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి భోజనం పెట్టడం ఎంతో పుణ్యకార్యమని, పౌర్ణమి రోజున కూడా ఈ సేవా కార్యక్రమాన్ని విస్తరించాలని సూచించారు. కార్యక్రమంలో వేముల అంజి, డాక్టర్ దొంతుల మనోహర్, సమితి వ్యవస్థాపకులు నలుమాచు హరికిషన్, రేగురి కరుణాకర్, తంశెట్టి శ్రీనివాస్, మంచాల శ్రీనివాస్, గంగాధర మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పడకంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# స్పీడ్ పెంచిన శ్రీనిధి శెట్టి

టాలీవుడ్‌లో మరో క్రేజీ కాంబినేషన్ ఫిక్స్ అయ్యింది. విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపుదిద్దుకుంటున్న విషయం తెలిసిందే. హారిక అండ్ హాసిని చిత్ర నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. అయితే ఈ సినిమాలో కథానాయిక విషయంలో శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా అంటూ పలువురి పేర్లు తెర మీదకు వచ్చినా చివరకు కన్నడ నటి శ్రీనిధి శెట్టిని ఫైనల్ చేశారు. తాజాగా మంగళవారం శ్రీనిధి జన్మదినాన్ని పురస్కరించుకుని మేకర్స్ శుభాకాంక్షలు తెలుపుతూ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే ఈ ఏడాది హిట్3 చిత్రంతో మంచి విజయం రుచి చూసిన శ్రీనిధి దీపావళికి తెలుసు కదా అనే సెన్సిబుల్ సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇది ఇలా ఉండగానే విక్టరీ వెంకటేశ్, త్రివిక్రమ్ వంటి అగ్ర స్థాయి టీమ్‌తో పని చేసే ఛాన్స్ దక్కడంతో ఆమె ఆనందానికి అవధులు లేకుంగా పోయాయి. ఇప్పుడు ఈ చిత్రమే కాకుండా తమిళంతో అజిత్‌తో ఒకటి తెలుగులో మరో రెండు సినిమాలు సైతం అమ్మడి చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే.. ఇప్పటికే వెంకటేశ్ సూపర్ హిట్ చిత్రాలు 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ రచన చేశారు. దీంతో ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయి. అదేవిధంగా తమన్ కాకుండా యానిమల్ ఫేం హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండడం విశేషం. కాగా ఈ మూవీ 2026 వేసవిలో ప్రేక్షకుల ఎదుటకు వచ్చే అవకాశం ఉంది.

# రామ్‌చరణ్‌తో జోడిగా కృతి సనన్!

## చాన్స్ ఇచ్చిన సుకుమార్



ఇతర భాషల నుంచి చాలా మంది ముద్దుగుమ్మలు మన దగ్గరకు వచ్చి స్టార్స్ గా మారుతున్నారు. తెలుగు అమ్మాయిలకు మంచి అవకాశాలు వస్తున్నా కూడా ఇతర భాషల హీరోయిన్స్ మన దగ్గర స్టార్ డమ్ సొంతం చేసుకుంటున్నారు. కన్నడ నుంచి వచ్చిన రష్మిక మందన్న తెలుగు సినిమాలతోనే విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. అలాగే హిందీ నుంచి వచ్చిన మృణాల్ మన దగ్గర టాప్ హీరోయిన్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది పేర్లు లిస్ట్ లో ఉంటాయి. అయితే ఇతర భాషల నుంచి వచ్చిన అందరు హీరోయిన్స్ సక్సెస్ అవ్వరూ.. కొంతమంది మాత్రం బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్ అందుకుంటూ ఉంటారు. దాంతో తిరిగి తమ ఇండస్ట్రీకి చెక్కేస్తుంటారు. అలానే ఓ అమ్మడు తెలుగులో రెండు సినిమాలు చేసింది. రెండు పెద్దగా ప్రేక్షకులను మెప్పించలేదు.. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? తెలుగులో డిజాస్టర్ అందుకుంది.. బాలీవుడ్ లోనూ పెద్దగా హిట్స్ లేవు. ఆయినా కూడా ఇప్పుడు ఓ బడా హీరో పిలిచి మరి ఛాన్స్ ఇచ్చాడు ఆ అమ్మడికి.. ఇంతకూ ఆమె ఎవరో కాదు.. బాలీవుడ్ పొడుగుకాళ్ల సుందరి కృతి సనన్. బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ గురించి చెప్పక్కర్లేదు. ఇప్పుడు హిందీలో సెటిల్ అయిన భామ.. ముందుగా తెలుగులోనే నటించింది. మహేష్ బాబు, సుకుమార్ కాంబోలో వచ్చిన 1 నేనొక్కడినే చిత్రంతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ సినిమా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత నాగచైతన్యతో కలిసి దోచేయ్ అనే సినిమా చేసింది. ఈ సినిమా డిజాస్టర్ అవ్వడంతో బాలీవుడ్ షిఫ్ట్ అయ్యి అక్కడే వరుస సినిమాల్లో నటిస్తుంది. మొన్నామధ్య ప్రభాస్ తో కలిసి ఆదిపురుష్ అనే సినిమా చేసింది. రామాయణం నేపథ్యంలో వచ్చిన ఈ సినిమా డబుల్ డిజాస్టర్ అయ్యింది. ఇక ఇప్పుడు ఈ అమ్మడికి సుకుమార్ ఛాన్స్ ఇచ్చారని తెలుస్తుంది. సుకుమార్, రామ్ చరణ్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాలో కృతి సనన్ హీరోయిన్ గా నటిస్తుందని టాక్ వినిపిస్తుంది. గతంలో సుకుమార్ తెరకెక్కించిన వన్ నేనొక్కడినే సినిమాలో కృతి హీరోయిన్ గా చేసింది. ఇప్పుడు మరోసారి ఆమెకు సుక్కు ఛాన్స్ ఇచ్చాడని తెలుస్తుంది.




# రవితేజ మాస్ జాతర నుంచి 'సూపర్ డూపర్ హిట్ సాంగ్' విడుదల!

సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్ నుంచి రాబోతున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. రవితేజ కథానాయకుడిగా నటిస్తున్నాడు. ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొటుంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా తాజాగా మూవీ నుంచి సూపర్ డూపర్ హిట్ సాంగ్' ను విడుదల చేశారు మేకర్స్. ఈ పాటకు సురేష్ గంగుల సాహిత్యం అందించగా.. భీమ్స్ సిసిరోలియో, రోహిణి సొర్రాట్ పాడారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించాడు. సంగీత ప్రియులను ఉర్రూతలూగిస్తూన్న ఈ పాటను మీరు కూడా చూసేయండి.

# బాలీవుడ్‌లో బిజీగా మారిన శ్రీలీల

పైకి ఖాళీగా ఉన్నట్లే కనిపిస్తుంది కానీ నిజానికి చాలా బిజీగా ఉన్నారు శ్రీలీల. అస్సలు ఖాళీ లేకుండా ఉన్నారీ భామ. ఓవైపు టాలీవుడ్.. మరోవైపు బాలీవుడ్.. ఇంకోవైపు కోలీవుడ్.. అన్ని ఉడ్లలో మోస్ట్ వాంటెడ్ అయిపోతున్నారు శ్రీలీల. ముఖ్యంగా ముంబై నుంచి అమ్మడికి అదిరిపోయే అవకాశాలు వస్తున్నాయి. ఆల్రెడీ కార్తిక్ ఆర్యన్ హీరోగా శ్రీలీల హిందీలో డెబ్యూ చేస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ వేగంగా జరుగుతుంది. 2026 ఫస్టాఫ్‌లో విడుదల కానుంది ఈ చిత్రం. ఇది సెట్స్‌పై ఉండగానే.. మరో రెండు మూడు ఆఫర్స్ శ్రీలీల ఖాతాలో చేరిపోయేలా ఉన్నాయి. మరోవైపు రణ్‌వీర్ సింగ్‌తో అట్లీ దర్శకత్వంలో ఓ యాడ్ చేసారు శ్రీలీల. దీన్ని ఏకంగా ఓ సినిమా రేంజ్‌లో తెరకెక్కించారు అట్లీ. తెలుగులోనూ ఫుల్ బిజీగా ఉన్నారు శ్రీలీల. ఇప్పటికే పవన్‌తో నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ షూట్ పూర్తి కాగా.. మాస్ జాతర అక్టోబర్ 31న విడుదల కానుంది. ఈ రెండింటి తర్వాత శ్రీలీల తెలుగులో గ్యాప్ తీసుకుంటున్నారు. మరోవైపు తమిళంలో పొంగల్‌కు పరాశక్తితో రాబోతున్నారు. మూడు ఇండస్ట్రీలను కవర్ చేస్తూ సూపర్ బిజీ అయిపోయారు ఈ బ్యూటీ. వరస సినిమాలైతే చేస్తున్నారు కానీ విజయాల విషయంలో మాత్రం కాస్త వెనకబడ్డారు శ్రీలీల. చివరగా గుంటూరు కారం పర్లేదనిపిస్తే.. భగవంత్ కేసరి హిట్ లిస్టులో చేరింది. ఆ తర్వాత పుష్ప 2లో కిస్ కిస్ కిసిక్ పాటతో దేశాన్ని ఊపేసారు ఈ బ్యూటీ. ఇప్పుడు మళ్లీ జోరు పెంచేస్తున్నారు. మరి ఇందులో ఆమె కోరుకున్న విజయం ఏ ఇండస్ట్రీ నుంచి వస్తుందో చూడాలి.



# మొదటి రోజు థామా కలెక్షన్లు ఎంతో తెలుసా?



నేషనల్ క్రష్ రష్మిక మందన, బాలీవుడ్ హీరో ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో దర్శకుడు ఆదిత్య సర్పోదర్ రూపొందించిన హారర్ కామెడీ చిత్రం 'థామా'. ఈ సినిమా దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్ దక్కించుకున్న ఈ చిత్రం మంచి వసూళ్లను రాబడుతుంది. ఈ చిత్రం తొలిరోజే రూ. 25.11 కోట్ల వసూళ్లు రాబట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. అంతేగాకుండా ఆయుష్మాన్ ఖురానా కెరీర్‌లో మొదటిరోజు ఈ స్థాయిలో వసూళ్లు సాధించిన మొదటి చిత్రంగా 'థామా' చిత్రం నిలిచింది. మరోవైపు వీకెండ్ వస్తుండటంతో ఈ కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ సినిమాను మాడాక్ ఫిల్మ్స్ నిర్మించింది.